శ్రీ మహాగణాధిపతయే నమః

సోపానపంచకం

శ్రీ శంకరాచార్యులవారిచే రచింపబడిన శ్రీ మదద్వైతోపదేశ పంచ రత్నములనే మరియొక పేరుగల సోపానపంచకం మద్దులపల్లి మాణిక్య శాస్త్రిచే రచింపబడిన తత్వరహస్యప్రభయను తెలుగు టీకాతాత్పర్య వివరణసహితము.

పరమదయాళువులయిన శంకరభగవత్పాదులవారు సంసార దావాగ్నిచే దగ్ధులై అతితాపమునుపొందుచున్న జీవరాసులనుచూచి ఆత్మ జ్ఞానామృతముచేతనే ఈ తాపమును శమింపచేయవలయునుగాని వేరు సాధనం లేదని యాలోచించి జ్ఞానమనే సాధనమునే ఉపదేశించిరి. ఈ జ్ఞానమువలన అజ్ఞానముతోసహా సంసార జననమరణ తాపశాంతియు పరమానందప్రాప్తియు కలుగును. అజ్ఞానమువలన సంభవించిన తాపము జ్ఞానమువలననే పోవునుగాని కర్మవలన పోదు. జ్ఞానఫలమైన మోక్షం నిత్యము, కర్మఫలము అనిత్యము.

తేతంభుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి అని పుణ్యఫలమును స్వర్గలోకంలో అనుభవించి మరల ఈలోకమునకు వచ్చెదరని భగవద్వచనం చెప్పుచున్నది. ఈలోకంలో వ్యవసాయ వ్యాపారాదులవలన కలుగు ఫలం నశించిపోవుచున్నది. మరల చేయవలసివస్తున్నది. ఇటులనే పుణ్యకర్మలకు ఫలములైన స్వర్గాదిసుఖములు కూడా కొంతకాలమునకు నశించునవేగాని నిత్యములుకావు. (కొన్ని చోట్ల) చాతుర్మాస్యయాగంచేస్తే నిత్యమయిన సుఖం వచ్చునని చెప్పినను ఆ పుణ్య

ఫలం చాలాకాలం వుండుననే యర్థంకాని పూర్తినిత్యంకాదని తాత్పర్యం. అశ్వత్థామా బలిర్వ్యాసః హనుమాంశ్చ విభీషణః కృపః పరశురామశ్చ సప్తైత స్థిరజీవినః అని వచనమున్నది.

అశ్వత్థామ, బలిచక్రవర్తి, వ్యాసులవారు, హనుమంతుడు. విభీషణుడు, కృపాచార్యులవారు, పరశురాములవారు స్థిరజీవులంటే బ్రహ్మకల్పం పూర్తిగా జీవింతురనేగాని అసలే ఆపుపాదులకు నాశంలేదని అర్థంకాదు. కర్మఫలంకూడా నిత్యమన్నను ఎక్కువకాలం ఉంటే వుంటుంది గాని అసలు నాశం లేదనికాదు. శ్రుతికూడా మోక్షమునకు జ్ఞానముకంటె రెండవ మార్గంలేదని చెప్పుచున్నది. గనుక కర్మ నిత్యసుఖ సాధనంకాదు. అర్థము, కామము, నిత్యసుఖమునకు అసలు సాధనములు కావని ప్రత్యక్షంగా తెలుస్తున్నదికదా ! అందువలన నిత్యసుఖరూపముగా మోక్షమునకు జ్ఞానమే సాధనం గనుక అట్టి జ్ఞానం ఏ సాధనమువలన కలుగునని ఆలోచించి గీతా భాష్యము, ఉపనిషద్భాష్యము, సూత్రభాష్యము అను అతి గంభీరమైన సముద్రమునుండి అయిదు రత్నములను సంపాదించిరి. అనగా భాష్యత్రయసారమును ఈ అయిదు పంచరత్నములతో చెప్పిరని యర్థము. సామాన్య జనులకుకూడా సులభముగా తెలియుటకు సులభశైలితో పూర్వజన్మ సంస్కారమువలన నేనేమిచేసిన కృతకృత్యుడనగుదునని తెలుసుకొన తలచి (ఒక) శిష్యుడగు బాలుని ఉద్దేశించి అనుగ్రహముచేత గురువుగారు ఒక మెట్టు ఎక్కిన తరువాత మరియొక మెట్టు ఎక్కుమని చెప్పినట్లు సోపానక్రమముగా ఉపదేశించిన పద్ధతిని కల్పించి శంకర భగవత్పాదులవారు చెప్పుచున్నారు.

అందువలనే ఈ శ్లోకములను సోపాన పంచకమనికూడా అంటారు. ఆ క్రమమునే ఉపదేశిస్తున్నారు.

శ్లో॥ వేదోనిత్య మధీయతాం। తదుదితం కర్మ
స్వనుష్ఠీయతాం। తేనేశస్య విధీయతా మపచితిః.
కామ్యేమతి స్త్యజ్యతాం॥ పాపౌఘః పరిధూయతాం।
భవసుఖేదోషాఽను సంధీయతా మాత్మేచ్ఛా వ్యవ
సీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతాం ॥౧॥

ప్రతిపదార్థము నిరూపణము.

వేదః = అంగముతోకూడిన వేదము, నిత్యం = యల్లప్పుడు విహితకాలమందు, అధీయతాం=త్వయా అని కలుపుకొని నీచేత (గురు ముఖతః చదువబడుగాక అని యర్థము చెప్పవలయును, కర్మణి ప్రయోగం గనుక, చదువ బడుగాక యని సంప్రదాయమునుబట్టి అర్థము చెప్పినను, చదువవలయుననియే అర్థం. ఈ శ్లోకములో అంతట ఇట్లె చెప్పుకొనవల యును. తదుదితం=తత్ ఆ అధ్యయనంచేయబడిన వేదంచేత ఉదితంచేయ వలయునని విధింపబడిన, కర్మ=కర్మ, స్వనుష్ఠీయతాం=నీచేత బాగుగా (అనుష్ఠానం) చేయబడుగాక, తేన = అనుష్ఠింపబడిన ఆకర్మచేత, ఈశస్య=పరమేశ్వరునియొక్క, అపచితిః=పూజ, విధీయతాం = యథా విధిగా చేయబడుగాక, ఇక్కడ పూజయనగా కర్మఫలమును ఈశ్వరార్ప ణం చేయుటయని (యర్థము).

కామ్యకర్మకూడా వేదవిహితమే గనుక కామ్యంగాకూడా కర్మ చేయవచ్చునుకదా యనే ప్రశ్నకు సమాధానం. కామ్యే=కామ్య కర్మ యందు, మతిః=చేయవలయుననే బుద్ధి, త్యజ్యతాం=విడచిపెట్టబడుగాక (ఫలమును ఈశ్వరార్పణం చేసిన నిష్కామ కర్మానుష్ఠానముచేత), పాపౌఘః=(పాప=పాపములయొక్క, ఓఘః=రాశి)పాపరాశి, పరిధూయ

తాం=బాగా దులపబడుగాక, విడిచిపెట్టబడుగాక యని యర్థము, భవ సుఖే=సంసారసుఖమందు దోషః=అనిత్యమని, దుఃఖసంబధము కలదనే దోషము, అనుసంధీయతాం =స్మరింపబడుగాక, (కర్మఫలమును విడిచి సంసారసుఖం మంచిది కాదనుకుంటే మనకు పురుషార్థమేమి అంటా వేమో నాయనా) ఆత్మేచ్ఛా = ఆత్మవిషయక, ఇచ్ఛా వ్యవసీయతాం= నిశ్చయింపబడుగాక, అనగా ఆత్మ సచ్చిదానంద స్వరూపముగనుక అట్టి ఆత్మను తెలుసుకుందామనే కోరికను సంపాదించుకొనమని యర్థము, ఆత్మయందు కోరికకలిగినంత మాత్రంతో చాలదు. విచారంకూడా చేయ వలయును. అట్టి విచారం గృహమందు బాగా జరుగదని చెప్పుచున్నారు కదా! అంటే నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతాం, నిజగృహాత్=నిజ తన సంబంధమయిన, గృహాత్=ఇంటినుండి, తూర్ణం=శీఘ్రముగా అనగా తొందరగా వినిర్గమ్యతాం=(అభిమానంవదలి)వెళ్ళబడుగాక.

తాత్పర్య వివరణం,

తీవ్ర వైరాగ్యం కలవారుగాని సర్వసంగపరిత్యాగం చేయలేరు. అట్టివారికే జ్ఞానం కలుగును. ఇట్టి తీవ్రవైరాగ్యం పూర్వజన్మలయందు చేసిన నిష్కామకర్మానుష్ఠానమువలన ఈ జన్మలో విశేషంగా చేయని వారికిగూడా కొందరికి బాల్యమందే కలుగును. వారు బ్రహ్మజిజ్ఞాస కలిగి బ్రహ్మవిచారం అనగా శ్రవణం మననంచేసి ఆత్మానుభూతిని పొంది కృత కృత్యులగుదురు వారిమాట అట్లా వుంచండి. అట్టి తీవ్రవై రాగ్యం లేని వారు క్రమముగా ఆస్థితిని పొందవలెనని గురువు శిష్యునితో చెప్పినట్లు చెప్పుచున్నారు. ఇది ద్విజుల విషయంలో చెప్పిరి. నాయనా నీవు విరక్తు డవై జ్ఞానం కలిగి తరించాలంటే ఇట్లు చేయుము. నిత్యము వేదమును చదువుము. ఉపనయనమైన తరువాత సద్గురువులవద్ద శక్తివుంటే అన్ని వేదములను, లేనియడల తన శాఖను చెందిన వేదమునుగాని చదువ

వలయును. అర్థజ్ఞానంకొరకు శిక్షా, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం కల్పము అను ఆరు వేదాంగములనుకూడా చదువవలయునని యర్థము. శాస్త్ర జ్ఞానంలేనిది వేదముల అర్థం బాగుగా తెలియదు గనుక శాస్త్రజ్ఞానం చాలా అవసరం. శాస్త్రజ్ఞానం బాగుగా వున్నపుడే వేదములోని కర్మకాండగాని జ్ఞానకాండగాని బాగుగా అర్థమగును. బాగా చదివి అర్థం చేసుకొని, వారివారి అధికారముల ననుసరించి వేదశాస్త్రములు ఎవరెవరికి యే యే కాలములయందు యే యే కర్మలు చేయతగినవని చెప్పుచున్నవో ఆయా కర్మలను వారు చేయవలయును. అధికారం లేని కర్మలనుచేసి నరకము పొందకూడదు.

నిత్యకర్మలు నైమిత్తిక కర్మలు, కామ్యకర్మలు అని కర్మలు అనేక విధములుగానున్నవి. నిత్యము లనగా స్నానం సంధ్యావందనం మొదలగు కర్మలు. ఈ కర్మలను చేయకపోతే పాపం వస్తుంది. అందు వలన పాపం రాకుండా తప్పక చేయవలెను. చేసిన పాపక్షయంకూడా అగును నైమిత్తకములనగా ఒక నిమిత్తం వచ్చినపుడు చేసితీరవలసి నవి. గ్రహణం పట్టింది, ఆ నిమిత్తంవలన పట్టు స్నానం విడుపు స్నానం చేయవలయును ఇలాంటివి. కామ్యకర్మలు పుత్రులు, పశువులు, ధనం మొదలగు ఫలములు కావలెననే కోరిక కలవారికి ఆ ఫలములు సిద్ధించుటకుగాను చెప్పబడి కర్మలు.

శ్రౌతకర్మలు. స్మార్తకర్మలనికూడా భేదమున్నది. అగ్నిహోత్రం మొదలగునవి శ్రౌతకర్మలు. ఔపోశనం వైశ్వదేవం మొదలగునవి స్మార్తకర్మలు ఈ విషయంలో ఇంకా వ్రాసిన చాలా విస్తారమగును. గనుక కొద్దిగా తేకాలను వ్రాసితిని. కర్మఫలం అనిత్యమగు స్వర్గాదులు జ్ఞానఫలం మోక్షము, అది నిత్యము ఇట్టి కర్మలను మోక్షానికి ఉపయో

గించవలెనంటే ఈశ్వరార్పణ బుద్ధ్యా, కోరికలేకుండా చేయవలెను. అట్లు చేసినయెడల పాపముపోయి, అంతఃకరణశుద్ధి కలుగును. అంతఃకరణ శుద్ధి కలిగిన తరువాత జ్ఞానము కలుగును. వైరాగ్యము కలుగునంతవరకు నిష్కామ కర్మానుష్ఠానమనే కర్మయోగమే అవసరము.

కామ్యకర్మలనుకూడా వేదము చెప్పుచున్నది. కాని ఫలం కావలె ననే కోరికతో కర్మలను చేసినయెడల జన్మ పరంపరకలుగును గనుక ఫలాకాంక్షతో చేసినయెడల వైరాగ్యం కలుగదు. కనుకను కామ్య కర్మ లను వదలివేయమని చెప్పిరి. కామ్యకర్మలనుకూడా కోరికలేకుండా చేసిన యడల బంధకములు కావుగాని కామ్యములయందు ప్రవర్తించిన ఫలముల యందు కోరిక కలుగవచ్చును. కోరిక జ్ఞానమార్గమునకు ప్రతిబంధకమగు నని కామ్యేమతి స్త్యజ్యతామని చెప్పిరి.

పాపౌఘః పరిధూయతాం అనుటవల్ల అనేక పాపములన్నియు నిష్కామ కర్మానుష్ఠానమువలన నశించునని తేలుచున్నది. తరువాత సంసారిక సుఖములు నశించునవేగాని నిత్యములుకావు. సాంసారిక సుఖం రాకముందునూ దుఃఖమే పోయేటపుడుకూడా దుఃఖమే గనుక దుఃఖ ముతో కలిసియేయుండును. గనుక సంసారసుఖములు అనిత్యములు. దుఃఖ బాహుళ్యములు గనుక మనశ్శుద్ధికి ప్రతిబంధకమని జన్మ మరణప్రవాహము నకు దారి తీయునవని దోషముల నెంచవలయును. అటుల దోష దృష్టి కలిగిన విషయములయందు విరక్తి కలుగును. ఆ విరక్తివలన ఆత్మేచ్ఛ అనగా బ్రహ్మ జిజ్ఞాస కలుగును. తీవ్రమైన బ్రహ్మజిజ్ఞాస కలిగేటట్లు కృషిచేయమని తాత్పర్యము.

ఆత్మేచ్ఛ అన్నను బ్రహ్మ జిజ్ఞాసయన్నను ఒకటేగాని వేరు కాదు. ఆత్మజిజ్ఞాస యనగా ఆత్మను తెలుసుకుందామనే కోరికయని అర్థము.

బ్రహ్మజిజ్ఞాస యనగా బ్రహ్మను తెలుసుకుందామనే కోరికయనే అర్థము; ఆత్మ అన్నను బ్రహ్మయన్నను భేదం లేదుగనుక ఏ విధంగానైన అనవచ్చును. ఆత్మ జిజ్ఞాస కలిగినంతమాత్రంలో జ్ఞానం కలుగదు. అట్టి ఆత్మజ్ఞానం కొరకు వేదాంత శ్రవణము విహితకర్మలనే ఈశ్వరార్పణం చేయవలయునుగాని, నిషిద్ధకర్మలనుచేసి ఈశ్వరార్పణం చేయకూడదు. అట్లు చేసిన నరకం వచ్చును. అందువలననే తేనే శస్యవిధీయతాం అని చెప్పిరి. మనసము నిధి ధ్యానం చేయవలయును గనుక అట్టి శ్రవణాది వేదాంత విచారము ఇంటిలో గృహస్థాశ్రమంలో చేయుటకంటే గృహారామక్షేత్రాచలయందు అభిమానమును వదలి, సన్యాసాశ్రమమును స్వీకరించి తీవ్రవైరాగ్యము కలవారై శ్రవణమననాదులను చేసినయెడల ప్రతిబంధము లేకుండా త్వరలోనే జ్ఞానం కలుగును. అట్టి మహాపురుషులు ముక్తులగుదురు. గృహస్థులుకూడా వారికి చెప్పబడిన కర్మలను యథాశక్తిగా చేసుకొనుచు ఖాళీ సమయములయందు కొంత అవకాశమును కల్పించుకొనికూడా అతి శ్రద్ధతో పెద్దలవలన వేదాంత శ్రవణమనన విచారణచేసి ఆత్మజ్ఞానమును సంపాదించి ముక్తులు కావచ్చును. సందేహం లేదు. శాస్త్రీయ విషయములలో శాస్త్రమే ప్రమాణం గాని మన ఊహయే ప్రమాణమని దిగకూడదు. గ్రంథం విస్తారమగునని సంగ్రహముగా వ్రాసితిని.

అవతరణిక.

దుర్జన సాంగత్యముచేసినయెడల విషయలోలత కలిగి ఆత్మజిజ్ఞాసలేక తత్త్వ విచారము కలుగదుగనుక దుర్జన సాంగత్యం పనికిరాదని సూచించుచు సజ్జన సాంగత్యమే చేయవలయునని చెప్పుచున్నారు.

శ్లో॥ సంగస్సత్సు విధీయతాం। భగవతో భక్తి ర్దృఢాధీయతాం।
శాంత్యాదిః పరిచీయతాం। దృఢతరంకర్మాశు సంత్యజ్యతాం।
సద్విద్వానుపసర్ప్యతా మనుదినం తత్పాదుకాసేవ్యతాం।
బ్రహ్మైకాక్షరమర్థ్యతాం శ్రుతిశిరోవాక్యం సమాకర్ణ్యతాం॥

ప్రతిపదార్థ వివరణము:

సత్సు=సత్పురుషులయందు, సంగః=సంబంధము, అనగా సహవాసము. విధీయతాం=చేయబడుగాక, అనేక విఘ్నములవలన తత్త్వవిచారమే జరుగకపోవచ్చును. జరిగినను దైవబలం లేకపోతే ఫలం సిద్ధించకపోవచ్చునుకదా! అంటే సమాధానం, భగవతోభక్తి ర్దృఢాధీయతాం! భగవతః=ఈశ్వరునియొక్క, భక్తిః=భగవంతునియందే పరమప్రేమతో మనస్సును లగ్నపరచుట,దృఢ=నిశ్చలమగునట్లు, ఆధీయతాం=చేయబడుగాక యని అర్థము మనస్సునకు గల కాలుష్యము ఆత్మవిచారమునకు ప్రతిబంధకముగనుక మనస్సు కాలుష్యంపోవ్రటకు ఉపాయమును చెప్పుచున్నారు. శాంత్యాదిః పరిచీయతాం ! శాంత్యాదిః=శాంతి మొదలగు సాధనం, పరిచీయతాం=అభ్యసింపబడుగాక యని అర్థము అనగా మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం అలవరచుకొనమని తాత్పర్యం. శాస్త్ర విహితకర్మచేసి తీరవలెనుకదా. చేయకపోతే పాపంకదా. ఆ కర్మరయందే అసక్తుడై యుంటే ఆత్మవిచార మెట్లు కలుగునంటే సమాధానం! దృఢతరం కర్మాశుసంత్యజ్యతాం। కర్మ=నిత్యనైమిత్తికాదికర్మ. దృఢతరం=శాస్త్రం చెప్పటచేత చేయవలసినదిగా చెప్పటచేత దృఢమైనదైనను, సంత్యజ్యతాం=విడిచిపెట్టబడుగాక, వైరాగ్యము కలిగిన తరువాత ఆలోచించకుండా కర్మసంన్యాసం చేయమని తాత్పర్యము. అలౌకికమైన బ్రహ్మవిచారమందు నాకెట్లా ప్రవృత్తి కలుగును ఎట్లా తెలుసును అంటే సమాధానం. సద్విద్వానుపసర్ప్యతాం। యోగ్యమైన పండితుడు ఉపసర్ప్యతాం

(చిగ్గరకు వెళ్ళబడుగాక) పొందబడుగాక యని అర్థము. విద్వాంసుని పద్దకు వెళ్ళినంతమాత్రంతో వారు నాకెందుకు ఉపదేశింతురు. నిస్పృహులు గనుక వారికి నాయందు కరుణ ఎట్లు కలుగునంటే సమాధానం.

అనుదినం తత్పాదుకాసేవ్యతాం! అనుదినం ప్రతిరోజు తత్పాదుకా తత్ ఆ గురుపుగారియొక్క పాదుకా పాదారవిందద్వయం సేవ్యతాం సేవింపబడుగాక గురువుల పాదసేవనమున అనుగ్రహము కలవారై తత్వమును ఉపదేశించుదురని భావము, అయితే అడిగితేకదా చెప్పేదరు గురువుగారిని ఏమి అడుగవలయును అంటే సమాధానం, ప్రబ్రహ్మైకాక్షర మర్థ్యతాం, ఏక (ఒకటి అయిన) సజాతీయ విజాతీయ స్వగతభేదరహిత మైన, అక్షరం=నాశము లేని బ్రహ్మ అనగా పరమాత్మ. అర్థ్యతాం ప్రార్థింపబడుగాక, ప్రబ్రహ్మైకాక్షరం అంటే మరియొక అర్థము. ప్రబ్రహ్మ. ప్రబ్రహ్మయొక్క ఏక ఒకటైన అక్షరం ఓంకారము అని అర్థము. బ్రహ్మను ఉపదేశింపమని లేక ఓంకారము నుపదేశింపమని కోరవలయునని భావము. బ్రహ్మను గురువుగారు ఎట్లుచెప్పేదరు అంటే సమాధానం శ్రుతిశిరో వాక్యం సమాకర్ణ్యతాం, శ్రుతి=వేదముయొక్క,శిరః=శిరస్సు అయినఉపని షత్తు యొక్క వాక్యం తత్వమసియను మహావాక్యము సమాకర్ణ్యతాం బాగుగా వినబడుగాక. ఉపనిషద్వాక్యములను అర్థముతో వినమని యర్థము

తాత్పర్య వివరణము :

పరమార్థ మార్గము లభించవలయునంటే సజ్జన సాంగత్యమే ముఖ్యము. ఇక్కడ సత్పురుషలనగా బ్రహ్మవిచారము చేయువారని తాత్పర్యము. అట్టివారితో సాంగత్యము చేసినవారికికూడా బ్రహ్మవిచారం లభించును. యోగవాసిష్ఠంలో శ్లో. మోక్షద్వారే ద్వారపాలాశ్చత్వారః పరి కీర్తితా, శమో విచారస్సంతోషః చతుర్థస్సాధుసంగమః అనివ సిష్ఠమహర్షి

శ్రీరామచంద్రమూర్తితో నాయనా! మోక్షద్వారమందు శమమని, విచారమని, సంతోషమని, సజ్జనసాంగత్యమని నలుగురు ద్వారపాలకులున్నారు. ఈ నలుగురిలో ఒకరినైనను అతి ప్రయత్నంతో స్వాధీనం చేసుకుంటే గాని ఈ ద్వారంలోనుండి వెళ్ళి మోక్షమనే ప్రభువును పొందలేము గనుక ఒక ద్వారపాలకుడైనా స్వాధీనుడు కావలయునని సాధుసంగమము అవసరమని చెప్పిరి. భజగోవింద శ్లోకములలోకూడా శంకరాచార్యులవారే సత్సంగత్వే నిస్సంగత్వమని సజ్జన సాంగత్యం ప్రధానమని చెప్పిరి.

ఈ శ్లోకములయందు సోపానములవలె జ్ఞానసాధనములనే చెప్పుచున్నారు గనుక, భగవంతునియందు భక్తికూడా జ్ఞానమునకు గొప్ప సాధనమే. భగవంతుడు అను శబ్దమునకు భగము కలవాడని అర్థము. భగము అనగా సమగ్రమైన ఐశ్వర్యము, సమగ్రమైన ధర్మము (కాని లేక శక్తి) గొప్ప యశస్సు, దేనికంటే బ్రహ్మాండంలో గొప్ప విలువో, అట్టి వన్నమాట గొప్ప సంపత్తు, గొప్ప వైరాగ్యము, గొప్ప జ్ఞానము. ఈ ఆరింటికి భగమని పేరు. ఈ ఆరుకలవాడే భగవంతుడు. ఈ యారు కలవాడు గనుకనే షడ్గుణైశ్వర్య సంపన్నుడంటారు. జీవుల వుత్పత్తి, ఎప్పుడు పుట్టేది. ఎప్పుడు (పొయ్యేది) మరణించేది, ఏ జన్మనుండి ఏ జన్మకు వచ్చేది, ఈ జన్మనుండి ఏ జన్మకు, ఏ లోకమునకు పోవునది, జ్ఞానమనగా నేమి? అజ్ఞానమనగా నేమి? ఈ అన్నిటిని బాగుగా తెలుసుకునే సర్వజ్ఞుడే భగవంతుడని చెప్పబడును. ఇట్టి భగవంతుని భక్తి అనగా సగుణ భక్తికూడా నిర్గుణ సాక్షాత్కారమునకు సాధనమేనని తాత్పర్యం.

శ్లో॥ ఈశ్వరానుగ్రహా దేవపుంసా మద్వైతవాసనా
పాపోపహత బుద్ధీనాం తద్వార్తాపి నరోచతే॥

అనే వచనంవల్ల ఈ జన్మయందుగాని, పూర్వజన్మలయందుగాని

భగవంతుని సేవించి భగవంతుని యనుగ్రహం పొందినవారికే, అద్వైత తత్వమును తెలుసుకొనవలయుననే శ్రద్ధ కలుగునుగాని పాపహృదయం కలవారికి ఆ మాట విందామనికూడా ఇష్టం కలగదని తెలియుచున్నది. అందువలననే సగుణోపాసన, చేత, నిర్గుణ సాక్షాత్కారము కలిగి మోక్షము వచ్చునని క్రమముక్తి మార్గమును శాస్త్రం చెప్పుచున్నది. ఇంద్రియములను విషయములవీడికి విచ్చలవిడిగా పోకుండా నిగ్రహించుట మనస్సును దుష్టసంకల్పములలోనికి పోకుండా నిలుపుటకూడా గొప్ప సాధనములే.

అందుచేతనే తైత్తిరీయోపనిషత్తులో తపస్సుతో బ్రహ్మను తెలుసుకొను సంకల్పం చేయమని చెప్పుచున్నది. అక్కడ తపస్సు అనగా మనో నిగ్రహం. ఇంద్రియనిగ్రహమే. శాస్త్రము చెప్పినప్రకారం తీవ్రవైరాగ్యము కలిగిన తరువాత సర్వ కర్మలను విడచిపెట్టి పరమహంసాశ్రమమును స్వీకరించవలయును. తరువాత బ్రహ్మనిష్ఠుడైన సద్గురువులను ఆశ్రయించి అట్టి మహానుభావుల పాదసేవచేసి, ఈశ్వరానుగ్రహమును సంపాదించినట్లు గురువు అనుగ్రహమునుకూడా సంపాదించవలయును. గురువు అనుగ్రహం కలిగినతరువాత స్వామీ నేను తరించుటకు ఉపాయమును ఆలోచించి పరమార్థతత్వమును ఉపదేశించమని కోరవలయును.

వారివలన ఉపనిషద్వాక్యములను వినవలయును. అనగా కేవల జ్ఞానకాండనే వినవలయును. పరమహంస లయినవారు తత్వమునే వినవలయును. తత్వమునే విచారించవలయును. ప్రవృత్తికి కారణమైన శాస్త్రములను, విషయములను విచారించకూడదు. "జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం" అని భగవద్గీతకూడా. విరక్తి కలిగిన ఉత్తమాధికారులకు జ్ఞానయోగమే సాధనమని విరక్తిలేనివారికి కర్మయోగమే అవశ్యకమని చెప్పుచున్నది. ఉపనిషద్వాక్యములు రెండు రక

ములు. అవాంతర వాక్యములని మహావాక్యములని, అవాంతర వాక్యము లనగా; సత్యస్వరూపమని, జ్ఞానస్వరూపమని, ఆనందస్వరూపమని, బ్రహ్మస్వరూపమును చెప్పు వాక్యములు. జీవునికి ఈశ్వరునికి ఐక్యమును బోధించునవి మహావాక్యములు. చాలా జాగ్రత్తగా ఉపనిషద్వాక్యములను వింటూ సర్వబంధములను, జన్మమరణములను నిర్మూలముచేయు జ్ఞాన మార్గమును అనుసరించి కృతకృత్యులు కావలయునని తాత్పర్యము.

అవరతణిక.

వేదాంతములలో మహావాక్యములు. జీవునికి పరమేశ్వరునితో ఐక్యమును బోధించుచున్నదికదా అది ఎట్లు కుదురును? జీవుడు కించిజ్ఞుడు కొద్దిజ్ఞానం కలవాడు. కర్తృత్వము. భోక్తృత్వము కలవాడు. తన స్థితిని కూడా తెలుసుకొనలేనివాడు. ఈశ్వరుడు. సర్వజ్ఞుడు. మూడు కాలములయందు అన్నింటిని తెలుసుకున్నవాడు. సర్వప్రపంచమునకు కారణ భూతుడు. ఇటువంటి విరుద్ధమైన ధర్మములతోకూడిన జీవేశ్వరులకు ఐక్యం కుదరదు గనుక, మహావాక్యోపదేశంవల్ల ఉపయోగమేమి? ఆ ధర్మములను తీసివేస్తే చైతన్యములకు అభేదమేగనుక, ఐక్యము బోధింప వచ్చునుకదా అండామంటే, అక్కడక్కడ జీవేశ్వరులకు భేదమున్నట్లును ఈశ్వరుడు ఉపాస్యుడని, జీవుడు ఉపాసకుడని భేదముతో సేవించు చున్నట్లు ప్రమాణములున్నవికదా. ఒక వ్యక్తి మరియొకవ్యక్తి స్వరూపుడు కావడమెట్లు అని ప్రశ్నలు కలుగవచ్చును. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పుచున్నారు.

శ్లో॥ వాక్యార్థశ్చ విచార్యతాం। శ్రుతిశిరఃపక్షస్సమాశ్రీయతాం
దుస్తర్కాత్సువిరమ్యతాం। శ్రుతిమతస్తర్కోఽనుసంధీయతాం

బ్రహ్మాస్మీతి విభావ్యతా మహరహర్గర్వః పరిత్యజ్యతాం
దేహేఽహం మతిరుజ్ఝతాం । బుధజనైః వాదస్త్యజ్యతాం ॥

ప్రతిపదార్థ నిరూపణం

వాక్యార్థశ్చవిచార్యతాం॥వాక్య=తత్వమస్యాదిమహావాక్యముయొక్క అర్థం: జీవబ్రహ్మలకు అభేదమనే అర్థము. విచార్యతాం = విచారింపబడుగాక. అసగా త్వం పదమునకు తత్పదమునకు వాచ్యార్థము లేవి? వాచ్యార్థములకు జీవేశ్వరులకుకల భేదము నిజమయిన భేదమా? ఉపాధుల ద్వారా వచ్చిన భేదమా యని విచారించి, ఒకే ఆకాశం రెండుపాత్రలు చేస్తే రెండు ఆకాశములయినది. రెండుపాత్రలుపోతే ఆకాశం ఒకటే. అట్లే ఆరోపితమైన మాయా అంతఃకరణలనే ఉపాధులద్వారా జీవుడని ఈశ్వరుడని భేదము ఏర్పడినది. జ్ఞానంచేత ఆ ఉపాధులను తీసివేస్తే జీవేశ్వరులు అఖండ సచ్చిదానంద స్వరూపులగుదురని విచారించి తెలుసుకొనమని యర్థము.

అనేకమంది మహానుభావులగు మతకర్తలు, జీవేశ్వర స్వరూపమును మోక్షస్వరూపమును భిన్నభిన్నముగా చెప్పుచున్నారుకదా, మీ పక్షమునే ఎట్లు ఆశ్రయించవలెనంటే సమాధానం, శ్రుతిశిరః పక్షస్సమాశ్రీయతాం. శ్రుతి=వేదములయొక్క, శిరః= శిరస్సువలె నున్న ఉపనిషత్తులయొక్క. పక్షః=పక్షము, సమాశ్రీయతాం=ఆశ్రయింపబడుగాక, మహాపురుషులు చెప్పినవి స్మృతులుగనుక స్మృతులకంటే శ్రుతులు ప్రబలములుగనుక శ్రుతులకు సమ్మతమైన అద్వైతసిద్ధాంతమునే గ్రహించమని యర్థము.

మహాపురుషులు చెప్పిన మతములు, యుక్తికి సరిపోతే ఆ మత

ములనే గ్రహించవచ్చునుకదా అంటే సమాధానం, దుస్తర్కాత్సు విరమ్యతాం దుస్తర్కాత్=దుష్టమైన శ్రుతులకు విరుద్ధమైన తర్కమునుండి సువిరమ్యతాం=బాగా విరమింపబడుగాక. అనగా వేదమునకు విరుద్ధమైన శాస్త్రములో చెప్పబడిన దోషములు కల యుక్తులకు ఆధారంగా చేసుకొని ఆయా మతములయందు ప్రవర్తించవద్దు. ఆ తర్కములను గ్రహించ వద్దని యర్థము. మహర్షులు చెప్పినను. విరుద్ధమగు యుక్తులతో చెప్పిన వదలమనే యర్థము. అయితే తర్కమంటె యుక్తికదా. యుక్తియనగా హేతుఫలతో విషయములు నిర్ణయించడంకదా. శ్రుతియే ప్రమాణమైతే. మంచి తర్కముకూడా పనికిరాదా అంటే సమాధానం.

శ్రుతిమతస్తర్కోను సంధీయతాం శ్రుతిమతః శ్రుతి=వేదమునకు మతః=సమ్మతమైన, తర్కః=అనుమానం (అనగా హేతువాదము) అను సంధీయతాం=స్మరింపబడుగాక, శ్రుతులు చెప్పిన అర్థమును బలపరిచే అనుమానమునే గ్రహించమని అర్థము. శ్రవణము మననము చేయమని చెప్పినట్లయినది. ఆత్మనిశ్చయం కలిగినను దేహేంద్రియములందు నేను అను భ్రమవెల్ల ఆత్మనిశ్చయమును మరచిపొతే యేమి చేయవలయునంటే సమాధానం, బ్రహ్మాస్మీతిపిభావ్యతాం బ్రహ్మాస్మీతి=సర్వోపాధులు లేని సచ్చిదానంద బ్రహ్మనే నేను అగుచున్నానని. విభావ్యతాం=విశేషముగా భావన చేయబడుగాక. అనగా ఎప్పుడు నేను దేహేంద్రియాది స్వరూపుడను కాను బ్రహ్మస్వరూపుడనే నని నిదిధ్యాసనం చేయుచుండవలయునని యర్థము.

శ్రవణ మననాదాలు చేసి జ్ఞానమును సంపాదించిన తరువాతనే నేనే జ్ఞానినని ఆహంకారం కలుగునేమోనని, అట్టి అహంకారమును వదలి పెట్టమని చెప్పగున్నారు. "అహరహర్గర్వాః పరిత్యజ్యతాం" అహరహః=ప్రతిరోజు, గర్వాః=నేను జ్ఞానిని, కృతార్థుడను అనే అహంకారము, పరి

త్యజ్యతాం=విడిచిపెట్టబడుగాక, అహంకారం పుట్టుటకు యెప్పుడు అవకాశముండునుగనుక యల్లప్పుడును అభిమానం విడిచిపెట్టే ప్రయత్నంలో వుండమని యర్థము. దేహమందు నేను అనే భ్రమరూపమగు అభిమానం వుంటే, నిను బ్రహ్మను అన నిశ్చయం ఎట్లు దృఢమగును అంటే సమాధానం "దేహేఽహం మతిరుజ్ఝతాం" దేహే=స్థూల దేహమందు,సూక్ష్మ దేహమందును, అహం మతిః=నేను అనే బుద్ధి, ఉజ్ఝతాం=విడిచిపెట్టబడుగాక, దేహమందు నేననే అభిమానమును వదలివేయుచు ఆత్మధ్యానం చేసినయెడల, ఆత్మజ్ఞానం దృఢమగునని యర్థము.

నాకు పరమ సిద్ధార్థం తెలిసినది. ఇతరులను వాదంలో జయించుట మంచిదంటారేమో. అది మంచిదికాదని చెప్పుచున్నారు. "బుధజనైః వాదః పరిత్యజ్యతాం" బుధజనైః=పండితులతో, వాదః=వివాద, పరిత్యజ్యతాం=విడిచిపెట్టబడుగాక. విజయంకలిగితే, నా అంతవాడు లేడని అహంకారం, అపజయం కలిగితే దుఃఖం మరల జయించవలెనని పట్టుదల కలుగును కనుక, శాంతికి భంగహేతువుగనుక, పండితులతో వాదించుట పనికిరాదని యర్థము.

తాత్పర్య వివరణం.

వేదాంతవాక్యములకు అర్థవిచారం బాగా చేయవలెను శ్రవణ మననములే వేదాంతవిచారమనగా సమస్త వేదాంతవాక్యములకు అద్వితీయ బ్రహ్మయందు తాత్పర్య నిర్ణయంకొరకుచేయు మానసికవ్యాపారమే. వేదాంత వాక్యములనువిని అర్థమును విని ఈ పదములకు వాచ్యార్థమేమి, లక్ష్యార్థమేమి, మామూలుగావుండేవాచ్యార్థమునువదలి లక్ష్యార్థమును గ్రహించుటలో కారణమేమి? ఉపనిషత్తు మొదట యేమని ప్రారంభించినది? యే అర్థంలో పూర్తి చేసినది, మధ్యలో ఏమిచెప్పినది? ఇందులో అపూర్వ విషయమేమి? ఫలమేమి? ఇందులో ఉన్న వాక్యములు యే అర్థమును బల

పరచుచున్నవి. ఈ ఉపనిషత్తు చెప్పిన అర్థం యుక్తికి సరిపోవ్రనా అని చక్కగా విచాకించవలయును, గాని పురాణకథలవలె, ఇతిహాసములవలె వినోదకరంగా సులభంగా అర్థమయ్యే విషయంకాదు. గనుక వేదాంత శ్రవణం ఇతర శ్రవణములకంటే శ్రమసాధ్యమని గ్రహించవలసి యుండును.

ఈ ఆధ్యాత్మిక విద్య అర్థమయితేమాత్రం చాలా ఆనందం కలుగు ననుటలో సందేహంలేదు. అందులోకూడా మహావాక్యములు. ఓ జీవుడా ! నీవు బ్రహ్మస్వరూపుడవని, బ్రహ్మైక్యమును బోధించుచున్నవి. జీవేశ్వరులకు నిజంగా భేదముంటే, ఆ భేదమును తీసివేయుట, జీవేశ్వరులకు అభేదం సంపాదించుట ఎవరికిని శక్యంకాదు. ఉపనిషత్తులకును శక్యంకాదు. అందువలన జీవేశ్వరులకు భేదం నిజమైన భేదంకాదు. ఉపాధులవలన ఏర్పడిన భేదమేనని అనుకొనవలయును. బ్రహ్మవేత్త అయిన జీవుడు బ్రహ్మయగునని యున్నది. బ్రహ్మను తెలుసుకున్నవ్యక్తి నిజంగా బ్రహ్మకంటే వేరు అయితే తెలుసుకున్నంత మాత్రంతో బ్రహ్మస్వరూపుడెల్లాఅవుతాడు, చాలాచోట్ల ఉపనిషత్తులు బ్రహ్మస్వరూపజ్ఞానం కలిగిన జీవుడు బ్రహ్మరూపు డగునని చెప్పుచున్నవి. పరమప్రమాణమైన వేదము చెప్పినవిషయం యథార్థముగా గ్రహించవలసినవేగాని, అయథార్థమని, అప్రమాణనుని భావించుట నరకమునకు కారణమగును గనుక వేదశాస్త్రములు చెప్పిన విషయములను అనుగుణ్యములని గ్రహించవలెను.

అనేక స్థలములయందు జ్ఞానమువలననే మోక్షమని ప్రమాణ వచనములు చెప్పుచున్నవి. జ్ఞానం వలన మోక్షం లభించునని చెప్పినందువలన బంధం అజ్ఞానంవలన ఏర్పడినదని, బ్రహ్మజ్ఞానంవలన జీవుడు బ్రహ్మయగునంటే, స్వతః బ్రహ్మ అయినవానికి జీవత్వం అజ్ఞానంవలన ఏర్పడినదని స్పష్టముగా చెప్పినట్లే ఆకాశమునకు అనేకపాత్రలవలన నానాత్వ

మేర్పడినట్లు ఆకాశమందున్న ఒక సూర్యునికి అనేక నీటిపాత్రలయందు అనేక ప్రతిబింబములుగా నానాత్వం ఏర్పడినట్లు సచ్చిదానందరూపమైన, అద్వైతమైన పరమాత్మ అజ్ఞానకల్పితమైన అనేక అంతఃకరణలయందు (ప్రతిబింబించి) జీవరూపముతో నానాత్వమును పొందినట్లు కనిపించుచున్నది గనుక నానాత్వము సత్యం కాదు, ఏకత్వమే సత్యం అనగా ఆకాశం ఏకమనుమాటయే సత్యంగాని, నానాయన్నది ఔపాధికమే. సూర్యుడు ఒకడనుటయే సత్యంగాని, నానాయను విషయం ఔపాధికమే.

అట్టి పరమాత్మయే భ్రమకు అధిష్ఠానం గనుక, అజ్ఞాతమైయున్నది సాక్షియేగనుక. దృశ్యంకాదు. అందువలన నిర్గుణము. గనుకనే యే పదమునకును వాచ్యార్థము కాదు. గనుకనే మహావాక్యంలోచేరిన తత్పదమునకు మాయోపాధికుడైన ఈశ్వరుడే అర్థమనిచెప్పిత్వం పదమునకు అంతఃకరణోపాధికుడగు జీవుడే యర్థమనిచెప్పి, ఇవి వాచ్యార్థములనిచెప్పి జీవేశ్వరుల కిద్దరికి చైతన్యరూపముతో అభేదమనేచెప్పి ఉపాధులద్వారానే భేదమేర్పడినదనిచెప్పి ఆ ఉపాధులు ఆరోపితములేగాని పరమార్థములు కావనిచెప్పి, భేదమునకు కారణమైన ఉపాధులను విడిచిపెట్టినయడల చైతన్యమే మిగులును గనుక. అదియే లక్ష్యార్థమని పరమార్థమని జీవ బ్రహ్మైక్యమని మహా వాక్యార్థమును అతి విపులముగా, అతి గంభీరంగా శాస్త్రకర్తలు, శంకరభగవత్పాదులవారును ప్రతిపాదించిరి.

బ్రహ్మభావమే ముక్తి. ఇదియే లక్ష్యస్వరూపము. గనుక అతి భక్తిశ్రద్ధతో మహాపెద్దల వచనములను, వేదాంతములను గ్రహించి తరించవలయునని తాత్పర్యము. శ్రుతులనే పరమప్రమాణముగా గ్రహించవలయునుగాని, కేవలయుక్తులను పరమప్రమాణముగా గ్రహించకూడదు. ఈ విషయంలో తార్కికుల సిద్ధాంతం. జీవులు ప్రతిశరీరంలో వేరువేరుగా నున్నారు. అనేకమంది జీవులని యర్థము. అందువలననే ఒకడు

సుఖమును అనుభవించును, మరియొకడు దుఃఖమును అనుభవించును చుండును, అందుచేత ఆత్మలు అనేకములుగా నున్నవికాని ఆత్మ ఒకటే కాదు, కర్తృత్వం ఆత్మకేగాని అచేతనమునకు కర్తృత్వం లేదు. అనుభవమునుబట్టికూడా ఆత్మకేగాని అచేతనములకుకాదు, అచేతనములకు కర్తృత్వ ముండేయడల రాళ్ళకుకూడా కర్తృత్వ ముండవలసి వచ్చును.

మోక్షము సుఖరూపముకాదు. సుఖం ఎప్పుడు దుఃఖముతో కూడి యుండును గనుక అది విడిచిపెట్ట తగనదియేగాని గ్రహించతగినది కాదు గనుక పురుషార్థము కాదు. దుఃఖ నివృత్తియే పురుషార్థమని చెప్పవలయు నని తార్కికులు చెప్పెదరు. కాని శ్రుతి సమ్మతంకాదు కామము సంకల్పము, సంశయము. శ్రద్ధ. అశ్రద్ధ మొదలయినవన్నియు మనస్సేనని శ్రుతి చెప్పుచున్నది, కర్తృత్వ భోక్తృత్వములు ఉపాధి ధర్మములేకాని మనోధర్మములు కావు. ఆత్మసన్నిధానమువలన దేహేంద్రియములకు కర్తృత్వ భోక్తృత్వములుండును. తాదాత్మ్య భ్రమవలన ఆత్మయం దున్నట్లు భాసించుచుండును. ఆత్మ ప్రతిబింబంలేని జడవస్తువులకు కర్తృత్వం ఉండదు. ఒకడు సుఖి, ఒకడు దుఃఖి యనుభేదం, ఉపాధియగు దేహేంద్రియ మనస్సుల తేడానుబట్టియే కుదురును, వైషయిక సుఖం దుఃఖంతో కూడియున్ననూ ఆత్మసుఖం సర్వదుఃఖరహితమని శ్రుతి తాత్పర్యమును గ్రహించవలయును.

ఆత్మ స్వప్రకాశానందరూపమని, దుఃఖరహితమని, సర్వాతీతమని శ్రుతులు చెప్పుచున్నవి గనుకను, యుక్తికిని సరిపోవుచున్నవి గనుకను, ఉపాధిభేదముచేతనే ఆత్మకు నానాత్వమని ఉపాధిభేదముచేతనే సుఖీ దుఃఖీ అనే తేడాలును కుదురునని, బంధమోక్షవ్యవస్థకూడా కుదురుననియ అద్వైతులు చెప్పెదరు. అద్వైతుల యుక్తులు శ్రుతిసమ్మతమైన యుక్తులు, తార్కికులు చెప్పేయుక్తులు శ్రుతికి విరుద్ధమైన యుక్తులు గనుక, ఆ

తర్కములను విడిచి అద్వైతులు చెప్పినశ్రుతికి అనుకూలమైనతర్కమునే గ్రహించే మననంచేయమని తాత్పర్యము.

శ్రవణ మననములుచేసి అసంభావనా విపరీతభావనలను పోగొట్టుకొని నేను సచ్చిదానంద పరబ్రహ్మస్వరూపుడనేయని ధ్యానంచేయవలయును ధ్యానంచేయుచుండగా సర్వపాపములు నశించును. మనస్సు పరిపాకస్థితికి వచ్చినుగాని సంస్కారమువలన నేనే గొప్పవాడ ననే అహంకారం కలుగవచ్చును. అట్టి అహంకారం తత్వానుసంధానముతోనేలేకుండా చేసుకొనవలయును. బ్రహ్మధ్యానంనుండి మనస్సు దిగజారి దేహేంద్రియములయందు నేననే అభిమానమును పొందకుండా నేను దేహేంద్రియస్వరూపుడను కానని భావిస్తూ అవి ఆత్మకంటే వేరుగా లేవనికూడా భావిస్తూ దేహాభిమానం లేకుండా చేసుకొనవలయును. ఈ అద్వైతదృష్టియందున్న ఆదరంతో, మతాంతరులతో వివాదం పనికిరాదు. ఆ వివాదం రాగద్వేషములకు కారణమై అద్వైతభావననుండి ప్రపంచభావనలోకి లాగివేయునుగనుక బహుజన్మవాసనవలన కలిగిన ద్వైతదృష్టిని వదలుట, అద్వైతదృష్టిని సంపాదించుట చాలా కష్టతరం గనుక ఈ సాధనసంపత్తిని సంపాదించి కృతకృత్యుడవు కావలయునని ఒక గురువు శిష్యునికి ఉపదేశించినట్లు శంకర భగవత్పాదులవారు మన కుపదేశించిరని గ్రహించవలయును.

అవతరణిక.

ఆత్మవిచారం జ్ఞానసాధనమే మంచిదేకాని. ఆకలి మొదలగు బాధలవలన ఆహార సంపాదనయందైనను ప్రవర్తించవలయునుకదా ఈవిధంగా ప్రవృత్తి కలిగితే మనస్సుకు నిశ్చలత్వం ఎట్లుకలుగును అనే ప్రశ్నకు సమాధానం వ్రాయుచున్నారు.

శ్లో॥ క్షుద్వ్యాధినిశ్చ చికిత్స్యతా మనుదినం భిక్షౌషధం
భుజ్యతాం।
స్వాద్వన్నం నతుయాచ్యతాం విధివశాత్ప్రాప్తేన
సంతుష్యతాం।
ఔదాసీన్య మభిప్స్యతాం జనకృపా నైష్ఠుర్య
ముత్సృజ్యంతాం।
శీతోష్ణాది విషహ్యతాం నతువృథావాక్యం
సముచ్చార్యతాం॥

ప్రతిపదార్థ నిరూపణము.

క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం = క్షుద్వ్యాధిః(వ్యాధిరివక్షుత్ క్షుద్వ్యాధిః) వ్యాధిలాంటి ఆకలి, చికిత్స్యతాం=చికిత్సచేయబడుగాక, లేక క్షుత్ చికిత్స్యతాం, క్షుత్=ఆకలి, చికిత్స్యతాం=చికిత్స చేయబడుగాక, వ్యాధిశ్చ జబ్బుకూడా. చికిత్స్యతాం=చికిత్స చేయబడుగాక, ఆకలికి, వ్యాధికి చికిత్స చేసినను మాటిమాటికి వస్తుంటుంది కదా అంచే, అనుదినం భిక్షౌషధం, భుజ్యతాం, అనుదినం=ప్రతిరోజు, భిక్షౌషధం=ఔషధంలాంటి భిక్ష, భుజ్యతాం, తినబడుగాక, లేక భిక్ష ఔషధం రెండు, భుజ్యతాం=తినబడుగాక, వ్యాధికి చికిత్సచేసి శరీరమును నిలుపుకున్నట్లు, ఆకలికి చికిత్స=అనగా తగిన ఆహారమునే భుజించి శరీరమును నిలుపుకొనవలెనని యర్థము. లేక శరీరమును నిలబెట్టుకొనుటకు జీవించి యున్నంతవరకు రుచిని విచారించకుండా హితమైన ఆహారంతో శరీరమును పోషించుకొన వలయును. వ్యాధి సంభవించినపుడు వ్యాధి తగ్గేంతవరకు మందుపుచ్చుకొనవలయునని కూడా యర్థము.

సర్వసంగ పరిత్యాగి అయినను, సన్యాసి అయినను హితమైన,పరిమితమైన, పవిత్రమైన ఆహారముతో శరీరమును పోషించుకొనుచు అనారోగ్యము కలిగినపుడు మందుపుచ్చుకొనుచు, శరీరమును రక్షించుకొనుచు పరమార్థమును సంపాదించవలయునని అర్థము వ్యాధి తగ్గుటకు రుచి అయిన మందులే కావాలంటే కుదరదుగాని రుచిగల పదార్థములను సంపాదించి భుజించి ఆకలిని తగ్గించుకొవచ్చునుకదా అంటే "స్వాద్వన్నం నతు యత్యతాం (యాచ్యతాం)" స్వాదు=రుచియైన, అన్నం=పిండి వంటలు, అన్నం, పులుసు, పప్పు కూరలు మొదలగు ఆహారం, నతు యత్యతాం=యత్నింపబడకుండుగాక.రుచియైన ఆహారం కొరకుయత్నించడంలో నిశ్చలస్థితి పొవునుగనుక జ్ఞానాభ్యాసమునకు భంగం కలుగునని యర్థము. పురుషప్రయత్నం లేకపోతే ఆహారం ఎట్లు లభిస్తుందంటే, "విధివశాత్ప్రాప్తేన సంతుష్యతాం" విధి=పూర్వజన్మయందు చేసిన కర్మయొక్క, వశాత్=పరిపాకస్థితివలన, ప్రాప్తేన=లభించిన అహారముచేత, సంతుష్యతాం=సంతోషింపబడుగాక, రుచియైన ఆహారమును కొరకు కర్మ ననుసరించి లభించిన ఆహారంవలన శరీరమును రక్షించుకొనుచు పరమార్థమును సంపాదించమని యర్థము.

మంచి వచ్చినపుడు సుఖం చెడు వచ్చినపుడు దుఃఖం కలుగునుకదా అంతట సమానభావం ఎట్లా కుదురును. అంటే "ఔదాసీన్య మభీప్స్యతాం ఔదాసీన్యం=ఉదాసీనస్థితి, అనగా ఊరకయుండుట, అభీప్స్యతాం=కోరబడుగాక, మంచి కలిగినపుడు పొంగిపోవుట, చెడుకలిగినపుడు దీనస్థితి పొందుట లేకుండా వుండవలయునని ఈ స్థితిని సంపాదించుచు అభ్యాసం చేయమని యర్థము. నా స్వవిషయంలో లాభలాభములయందు సమానభావముచేత ఊరికయున్నను, పరులయందు దయగాని, ఒకరికి మరియొకరు అపకారం చేయునపుడు కఠినభావంతో నివా

రించుటగాని అవసరంకదా. సమభావ మెట్లు కలుగునంటే, "జనకృపా నైష్ఠర్య ముత్సృజ్యతాం" అని చెప్పిరి. జన=జనులయందు, కృపానైష్ఠర్యం, కృపా=దయ, నైష్ఠర్యం=కఠినమైన సంభాషణ, (ఈ రెండు) ఉత్సృజ్యతాం=విడచిపెట్టబడుగాక, ఇతరుల విషయంలోనైనను దయా కోపంతోగాని, కఠినభావంతోగాని ప్రవర్తించి తన నిశ్చలస్థితికి భంగం కలిగించకూడదని యర్థము.

ఇవి నివారించుమన్నను శీతోష్ణాదులవల్ల దుఃఖంతప్పదుకదా అంటే "శీతోష్ణాది విషహ్యతాం" శీత=చల్లదనము; ఉష్ణ=వేడి, ఆది=మొదలగు, మానావమానస్థితి, విషహ్యతాం=విశేషంగా సహింపబడుగాక, అనగా గొప్పచలి, ఉగ్రమైన ఎండలు మానావమానాదులు సంభవించినపుడు సహించవలయునని యర్థము. ఎవరయినా మాట్లాడిస్తే మాట్లాడవలయును కదా ఆ సంభాషణవలన నిశ్చలస్థితికి చెడునేమోనంటే "నతు వృధావాక్యం సముచ్చార్యతాం" వృధా=వ్యర్థముగా, వాక్యంతు=వాగ్జాలము, నసముచ్చార్యతాం=ఉచ్చరింపబడకుండుగాక, అనగా మనశ్శాంతికి భంగకరంగా అనవసరంగా యేమాటలు మాట్లాడకూడదని యర్థము.

తాత్పర్య వివరణము.

సర్వకర్మసన్యాసంచేసి జ్ఞానమార్గమందు ప్రవేశించిన ఉత్తమాధికారులకుకూడా శరీరమును రక్షించుకొనుట అవసరమే. జ్ఞానమును సంపాదించుటకు సాధనమైన శరీరమును రక్షించుకొనుటకు మాత్రమే ఆహారం అనే దృష్టితో పవిత్రమైన, పరిమితమైన విరుద్ధంకాని ఆహారమును తీసుకుంటూ వుండవలయును. శరీరమును రక్షించుకుంటూ యుండవలెను. రోగములు వచ్చినపుడు మందులువాడి రోగములను పోగొట్టుకొనుటకూడా అవసరమే సన్యాసికికూడా. శరీరం బాగుగా లేనిది జ్ఞానాన్ని సాధించలేముకదా. ఔషధం ఏ ప్రకారంగా రుచిగా

నున్నదా లేదా యని విచారించకుండా వ్యాధిపోయి ఆరోగ్యంగా నుండుటయే ప్రధానమని పుచ్చుకుంటున్నారో అటులనే అహారంకూడా రుచిగా నుండవలయునని పిండివంటలు మొదలగు పదార్థములు కావలయునని కోరికలతో కాలహరణం చేయుచు. అ భోజనంవల్ల కలుగు సుఖమునే ప్రధానం చేయక, ఆకలితీరి, శరీరం సురక్షితంగా నుండుటయే ప్రధానమనుకొని అహారమును భుజించమని తాత్పర్యము.

భిక్షాటనకు వెళ్ళినపుడు యేదిలభించునో దానినే భుజించి తృప్తిపడవలయునని తాత్పర్యము. గృహస్థులు రుచికరమగు పదార్థములు పెట్టినను తన స్థితికి భంగంకాకుండావుండే అహారమునే పుచ్చుకొనవలయును. దయతో ఒకరిని బాగుచేయవలయుననిగాని, పరస్పర విరోధముతో ఒకరు మరియొకరిని బాధించుచున్నపుడు ఒక పక్షంలోచేరి అపకారం చేసేవారి మీద కక్షగట్టి కఠినంగా మాట్లాడుట వాళ్ళకు అపకారం చేయుట. తన మోక్షమార్గమునకు ప్రతిబంధకములుగనుక పనికిరాదు. తనకు ధర్మం కాదని తాత్పర్యము. తనను పూజించినపుడు పొంగిపోవుట, పూజించిన వారియందు విశేషాభిమానం తమను నిందిస్తే విచారపడుట. నిందించిన వారిమీద క్రోధం ఇవిలేకుండా మానావమానములు సంభవించినపుడు తోట్రుబాటులేకుండా నిశ్చలముగా నుండవలయును.

కావలెనని శీతంలోకి, యెండలోకి పోయి సహించే అభ్యాసం చేయనవసరంలేదు. కాని, ఆయా కాలములయందు చలిగాని, ఎండగాని, తటస్థించినపుడు వ్యసనపడకుండా సహనమును అభ్యసించమని తాత్పర్యము, అతి సంభాషణలేకుండా మౌనముగా నుండి ఈ సాధనసంపత్తిని రక్షించుకొనుచు పరబ్రహ్మానుభవమునుపొంది ముక్తులుకావలయునని తాత్పర్యము.

ఎవరితో విశేషసంభాషణలేకుండా మౌనంగాపుండుట నాకెట్లు లభించునంటే.

శ్లో॥ ఏకాంతే సుఖమాస్యతాం పరతరే చేతస్సమాధీయతాం॥
పూర్ణాత్మాను సమీక్ష్యతాంజగదిదం తద్బాధితందృశ్యతాం
ప్రాక్కర్మాపి విలాప్యతాం చితిబలాన్నాప్యుత్తరైర్శ్లిష్యతాం।
ప్రారబ్ధం త్విహభుజ్యతా మథ పరబ్రహ్మాత్మనాస్థీయతాం॥౭

ప్రతిపదార్థ నిరూపణము.

ఏకాంతే= ఎవరులేని ప్రదేశమందు, సుఖం=సుఖముగా, అస్యతాం వుండబడుగాక, అనగా యేకాంతమునను వెళ్ళియుండుమని అర్థము. నిర్జన ప్రదేశమందున్న, యడల మౌనమునకు భంగంలేకుండా వుండుగనుక ఏకాంతవాసము ముఖ్యసాధనమని యర్థము. ఏకాంతమందున్నను మనస్సు విషయములను ఆలోచించునుకదా యంటే పరతరే చేతస్సమాధీయతాం పరతరే=సర్వాతీతమగు పరబ్రహ్మయందు, చేతః=మనస్సు, సమాధీయతాం=బాగుగా వుంచబడునుగాక, ఇతరవిషయములమీదికి మనస్సును పోనివ్వకుండా పరమాత్మయందే నిలిపి బ్రహ్మానుసంధానంచేయమని యర్థము.

బ్రహ్మస్వరూపజ్ఞానం లేనిది ధ్యానంచేయుట ఎట్లు ప్రయోజనమేమిఅంటే "పూర్ణాత్మానుసమీక్ష్యతాం" పూర్ణాత్మా. పూర్ణ=వ్యాపకమయిన ఆత్మ=పరమాత్మ. సుసమీక్ష్యతాం=చూడబడుగాక, తెలుసుకొని ధ్యానంచేసి అపరోక్షానుభూతిని సంపాదించుమని భావము. ఆత్మప్రపంచముండగా పరిపూర్ణ మెట్లగునంటే జగదిదం తద్బాధితం దృశ్యతాం (త్యజ్యతాం) ఇదం=ఈ కనిపించే, జగత్=ప్రపంచము, తద్బాధితం, తత్=ఆ పరమాత్మ!జ్ఞానముచేత,బాధితం=నశింపచేయపడినదిగాదృశ్యతాం=చూడబడుగాక, పరమాత్మ జ్ఞానముచేత ఆరోపిత ప్రపంచమంతయు నశించునుగనుక ఆత్మ పరిపూర్ణమగుటలో విరోధంలేదని యర్థము.

పూర్వజన్మలయందు చేసిన కర్మలు ఆ జన్మలోనే ఫలమునివ్వక, జ్ఞానికికూడా జన్మలనివ్వవచ్చుకదా అంటే "ప్రాక్కర్మ ప్రవిలాప్యతాం చితి బలాత్ చితిః అనగా ఆత్మజ్ఞానం, దానియొక్క బలాత్=సామర్థ్యం వలన, ప్రాక్కర్మ=వెనుకచేసినకర్మ, ప్రవిలాప్యతాం=దహింపచేయబడుగాక, అనగా ఆత్మసాక్షాత్కారమువలన వెనుకచేసిన సంచిత కర్మ అంతయు నశించునుగనుక, మరల జన్మ రానేరదని యర్థము. వెనుక చేసిన కర్మలు జ్ఞానముచేత దగ్ధములయినవి గనుక వాటివలన జన్మ రాక పోవచ్చునుకాని. జ్ఞానం కలిగిన తరువాత చేసేకర్మలవలన మరల జన్మ రావచ్చునుకదా అంటే, చితి బలాన్నాప్యుత్తరైరశ్లిష్యతాం, చితి బలాత్ అనేపదం, ఈవాక్యంలో వెనుకవాక్యంలోకూడా అన్వయించవచ్చును.

చితిబలాత్=ఆత్మసాక్షాత్కార బలంవలన ఉత్తరై ఆగామి కర్మలతోకూడా అనగా జ్ఞానంకలిగిన తరువాత చేసే కర్మలతోకూడా నశ్లిష్యతాం = సంబంధం పొందబడకుండా వుండుగాక, అనగా జ్ఞానబలం వలన ఆగామి కర్మల సంబంధంలేకుండా చేసికొనుము. అనగా జీవత్వ భ్రమయే పోయినది గనుక కర్తృత్వములు నశించుగనుక సంచితమును నశించును. ఆగామి=అంటదు అని అర్థము. అయితే జ్ఞానంవల్ల పూర్వ కర్మలన్ని పోతే ఈ శరీరమునకు కారణమైన కర్మకూడా పోవును గనుక జ్ఞానంకలిగిన వెంటనే ఈ శరీరం పడిపోయి విదేహ కైవల్యం రావలసి వచ్చునుకదా అంటే ప్రారబ్ధం త్విహభుజ్యతాం.

ఇహ=ఈ శరీరమందు, ప్రారబ్ధంతు=ఫలమునిచ్చుటకు అరంభించిన కర్మ, భుజ్యతాం=అనుభవింపబడుగాక, ఈ శరీరమును కలుగ చేసిన ప్రారబ్ధకర్మను అనుభవించవలసినదే. ఇదియే ప్రారబ్ధం, ఈకర్మ ఉన్నంతవరకు దేహముండును, అంతవల్లనే జీవన్ముక్తి వంటారు.

దేహం పోగానే విదేహముక్తి దగునని భావము. ఆత్మజ్ఞానంవల్ల పాపములు పోవచ్చును. కాని మోక్షసిద్ధి ఎట్లాగంటే అథ పరబ్రహ్మాత్మనా స్థీయతాం అథ ఈ ప్రారబ్ధకర్మ పోయినతరువాత పరబ్రహ్మాత్మనా= పరబ్రహ్మ స్వరూపముచేతనే, స్థీయతాం=ఉండబడుగాక. జ్ఞానం కలుగగానే బ్రహ్మభావమును పొందునుగాని విదేహముక్తిమాత్రం ప్రారబ్ధం. అది మూలముగాగల ఈ దేహంపోగానే వచ్చునని, అట్టి పరబ్రహ్మ స్వరూప స్థితియే పరమ మోక్షమని. అట్టి మోక్షమునకు బ్రహ్మసాక్షాత్కారమే సాధనమని అట్టి జ్ఞానమునకు వెనుక చెప్పబడిన సాధనములన్నియు సాక్షాత్తుగా కాని పరంపరగాకాని సాధనములని యర్థము.

తాత్పర్య వివరణము.

సాధకునకు ఎవులేని నిశ్శబ్దముగానుండు యేకాంత ప్రదేశమందుండుట చాలా అనసరం, గొప్పసాధనం, మాట్లాడుటకుకూడా యెవ్వరు ఉండరుగనుక మౌనముగా నుండుట లటస్థించును. (వాఙ్మౌనం, మనోమౌనం, కాష్ఠమౌనం, సౌషుప్త మౌనం అని మౌనం నాలుగు విధములు. వాఙ్మౌనమనగా నోటితో మాట్లాడకుండా ఉండుటయే, ఆత్మకంటే భిన్నవిషయములలో సంభాషించకపోవుటకూడా వాఙ్మౌనంలో చేరును. మనోమౌనం అనగా ఆత్మకంటే భిన్నమైన ప్రపంచవిషయ చింతన లేకుండా వుండుటయే అనగా విషయాకారవృత్తులు లేకుండా వుండుట కాష్ఠమౌనమునగా శరీరముకదలకుండా, నిశ్చలంగా నుంచుకొనుటయే,సౌషుప్త మౌనమనగా గాఢనిద్ర పోయినపుడు ఏవిధమైన మనోవృత్తులు లేకుండా వుండును. ప్రపంచదృష్టి లేకుండా నుండును, ఇదియే సౌషుప్తమౌనము దనుక సౌషుప్త్మ మౌనమందు వాఙ్మౌనము, కాష్ఠమౌనము, మనోమౌనము సిద్ధించియున్నవి, చేరియున్నవి ఆ దశలో జీవుడు ప్రపంచాతీతుడెనటే.

అటులనే ఆత్మసాక్షాత్కారము కలిగినతరువాత ఆత్మను ఆవరించిన సర్వభ్రమలకు కారణమైన అజ్ఞానం పోయినపుడు అన్నియు నశించి పోవును శరీరంతో తాదాత్మ్యభ్రమయు, ఇంద్రియములతో తాదాత్మ్యభ్రమయు, మనస్సుతో తాదాత్మ్యభ్రమయు అన్నియు పోవును. ఆ ముక్తిదశయందుండు స్థితియే సౌషప్తమౌనము జ్ఞానదశయందు అజ్ఞానుల దృష్టికి జ్ఞాని మాట్లాడినట్లున్నను, తిరిగినట్లున్నను. రాజ్యపరిపాలన చేసినట్లున్నను, ఏపని చేసినట్లున్నను జ్ఞానికి అన్నివుపాధులతో తాదాత్మ్యభ్రమ పోయినదిగనుక, కూటస్థబ్రహ్మరూపుడై యున్నాడు గనుక, శరీరేంద్రియముల వ్యాపారం తనకు సంబంధించదు కనుక. జ్ఞాని యెప్పుడూ మౌనముగా నున్నట్లే.

ఈ శ్లోకంలో శంకరభగవత్పాదులవారు సాధనతోపాటు జీవన్ముక్తిని, దేహాముక్తిని చెప్పిరి. పూర్ణాత్మాసుసమీక్ష్యతాం జగదితం తద్బాధితం దృశ్యతాం. అనగా. దేశకాలవస్తుపరిచ్ఛేదరహితమైన, సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమైన సచ్చిదానంద స్వరూపమైన పరమాత్మ సాక్షాత్కారము కలిగిన తరువాత జగత్తు బాధితమగుననిరి. అనగా నశించునని యర్థము. దేపం వెలిగిస్తే చీకటి పోయినట్లు, పరమాత్మ జ్ఞానం కలిగితే పరమాత్మను ఆవరించిన అజ్ఞానం పోవును గనుక, అజ్ఞానంతో, సహా జీవత్వభ్రమతో సహా జగత్తు నశించునని యర్థము. జ్ఞానికి జ్ఞానమనే అగ్నివలన అగ్ని స్పర్శ అయ్యేసరికి రెల్లు వెన్ను ఎట్లు భగ్గున మండిపోవునో, అట్లే సంచిత కర్మలన్నియు మండిపోవును. అనగా నశించునని యర్థము. దేహేంద్రియములతో తాదాత్మ్యభ్రమ పోయినందువలన జ్ఞానం కలిగిన తరువాత ఆభాసగా పామరులదృష్టికి జ్ఞానికర్మలు చేయుచున్నట్లు కనిపించినను ఇతర శరీరములు చేసిన కర్మలు తనకు ఎట్లా అంటవో ఇదివరకు నాదని అనుకున్న జ్ఞాని శరీరంచేసిన కర్మలుకూడా జ్ఞానికి అంటవు.

ఈ శరీరముండుటనుబట్టి ప్రారబ్ధకర్మ ఉన్నదని చెప్పవలయును. ఈ శరీరాన్ని పుట్టించి, ఈ శరీరంలో సుఖ దుఃఖములను కలుగచేయు కర్మయే ప్రారబ్ధంకదా. ఈ శరీరం వున్నంతవరకు మాత్రమే పుండును. ఒక లక్ష్యంమీద బాణము వేయువాడు, చేతికి తీసుకున్న బాణములను వేయకుండా వదలివేయవచ్చును. మరియు వేయబోయేవి వేయకుండా మానవచ్చును. ధనుస్సుమీద ఎక్కుపెట్టిన బాణమునుకూడా వదలివేయ వచ్చునుకాని, ధనుస్సునుండి వేగంగా విడిచిన బాణమునుమాత్రం ఆపుటకు స్వాధీనంకాదు. దాని వేగమున్నంతవరకు వెళ్ళి పడిపోవలసినదే. అటు లనే ప్రారబ్ధ కర్మఫలము నిచ్చుటకు, విడిచిపెట్టబడినదిగనుక ప్రారబ్ధ వేగమున్నంతవరకు ఈ శరీరముండును. కాని దేహాభిమానం కలిగిన అజ్ఞాని హర్షవిషాదములను సుఖ దుఃఖములను పొందినట్లు జ్ఞాని హర్ష విషాదములను పొందడు. బ్రహ్మానందమునే అనుభవించుచుండును. విలా సముగా చూచుచుండును. ఈ విషయమునే ప్రాక్కర్మప్రవిలాప్యతాం చితి బలాన్నాపూర్యతైశ్లిష్యత్యాం ప్రారబ్ధంత్వీహభుజ్యతాం అని చెప్పుచూ సూచించిరి. "అథ పరబ్రహ్మాత్మనా స్థీయతాం" అని, ప్రారబ్ధవేగం పోయినతరువాత జ్ఞాని శరీరం పడిపోవుటగనుక విదేహ కైవల్యమును పొందును. సచ్చిదానంద స్వరూపు డగునని యర్థము.

మోక్షము ఆత్మ రూపమేగనుక, సిద్ధమేగాని, సాధ్యముకాదు. అజ్ఞాతమై యుండుటచేత లేనట్లున్నది. అజ్ఞానికి జ్ఞానం కలిగితే అజ్ఞానం నశించునుగనుక, అజ్ఞాననివృత్తి, జ్ఞానముచేత సాధ్యమైయున్నది గనుక మోక్షముకూడా సాధింపబడినదని భావిస్తున్నారు. జీవత్వం, ప్రపంచం, అజ్ఞానమూలక భ్రమవలన యేర్పడినట్లున్నవి గనుక జ్ఞానంకలిగితే పోయి నట్లున్నవేగాని వేరు కాదుగనుక బ్రహ్మసత్యం, జగన్మిథ్యా అనే అద్వైత సిద్ధాంతమును తెలుసుకున్నపుడు ఆశ్చర్యం కలుగును, ఈ విషయము

లను నెనకటి స్తోత్రములకింద వ్రాసియుండిని. అయినను వేరుగానున్న స్తోత్రములలో శంకరభగవత్పాదులవారు అనుగ్రహంతో మరలమరల చెప్పిరికూడా, అందుచేతను గంభీరమైన విషయముగనుకను సంస్కృత భాషాపరిచయం లేనివారికి కూడా దృఢమైన సంస్కారం కలుగుటకు మరల వ్రాసితిని.

ఇట్లు వ్రాయకపోతే ఈ శ్లోకంలో యీ అర్థం లేదని కొందరు అనుకొనవచ్చును. అందుచేత పునరుక్తిగా గ్రహించకుందురుగాక యని తలుస్తాను. శ్రీ మధుసూదనులతోపదేశ పంచరత్నములనే సోపాన పంచకస్తోత్ర ములో మొదటి నుండి క్రమముగా ఒకమెట్టు తరువాత మరియొకమెట్టు ఎక్కుటకు వీలుచేసినట్టి సాధన పరంపరను చెప్పిరి. అద్వైజ్ఞాన సాధన మైన శాస్త్రముతోసహా వేదమును నిత్యం చదువవలయును. ఆ వేదోక్త కర్మలను ఈశ్వరార్పణ బుద్ధ్యా చేయవలయును. ఇట్టి నిష్కామకర్మలను జ్ఞాన ప్రతిబంధకమైన పాపములను పోగొట్టుకొనవలయును, తరువాత వైరాగ్యం కొరకే విషయసుఖములను దోషదృష్టితో విడిచిపెట్టవలయును. పరమాత్మను తెలుసుకుందామనే జిజ్ఞాసను బలముగా సంపాదించవల యును. విషయములయందు విరక్తుడై, తత్త్వజిజ్ఞాసకలవాడై యిల్లు (భార్యా పుత్రాదులను వదలి అభిమానమును వదలి) వెళ్ళి తత్త్వ విచారము చేయు మహాత్ములతో సహవాసం చేయవలయును.

దృఢమైన భగవద్భక్తినికూడా సంపాదించవలయును. శమదమాది సంపత్తినికూడా సంపాదించవలయును. కర్మసన్యాసం చేయవలయును. అనగా సన్యసించవలయును. వెనుకటి సామాన్య సజ్జనసాంగత్యము కాక, బ్రహ్మనిష్ఠులైన విద్వాంసులైన సద్గురువులవద్దకు వెళ్ళవలయును. వారికి అనుగ్రహం కలిగేటట్లు వారి పాదసేవ చేయవలయును. వారియను గ్రహం సంపాదించి, బ్రహ్మతత్త్వమును చెప్పమని యడుగవలెను. వారి

వలన వేదాంత వాక్యములను, మహావాక్యములను అర్థముతో వినవలయును, అసంభావనా విపరీతభావన పొయ్యేంతవరకు మహావాక్యార్థమైన జీవబ్రహ్మైక్యవిచారం చేయవలయును. శ్రుతులకు విరుద్ధమైన మతములను ఆశ్రయించకుండా శ్రుతిసమ్మతమైన అద్వైతసిద్ధాంతమునే ఆశ్రయించవలయును.

శ్రుతులకు విరుద్ధమైన యుక్తిరూపమగు తర్కమును వదిలివేయవలయును. శ్రుతులకు సమ్మతమైన యుక్తులనే గ్రహించవలయును. మననం చేయమని యర్థము. తరువాత, నేను బ్రహ్మస్వరూపుడనని ధ్యానం చేయవలయును. నేను జ్ఞానినికదా యని అహంకారమును వదలివేయవలయును. దేహేంద్రియములయందు నేననే భ్రమను వదలివేయవలయును. ఇతర మతస్థులైన విద్వాంసులతో వివాదమును వదలుము. నిత్యం భిక్షాటనచేత లభించిన ఆహారముతో ఆకలిని శమింపచేసుకొనుము. అనారోగ్యం కలిగినపుడు ఔషదసేవచేసి శరీరం నిలబెట్టుకొనుము. ఔషధసేవవలెనే భిక్షాభోజనంకూడా శరీరమును రక్షించుకొనుటకేకాని, భోగప్రధానముగా రుచియైన పదార్థములను కోరకూడదు లాభాలాభములయందు సమానబుద్ధితో ప్రవృత్తిలేకుండా ఊరికే ఉండవలయును. తన తత్వనిష్ఠకు ప్రతిబంధకంగా ఎవరియందును దయతోగాని, క్రోధముతోకాని కలుగచేసుకొనవద్దు. శీతోష్ణములను సుఖ దుఃఖములను సహించవలయును వ్యర్థమైన సంభాషణలేకుండా మౌనము నవలంభించవలయును.

అట్టి మోక్షమును అభ్యసించుటకు నిర్జనప్రదేశమందు (నివసించ) ఉండవలయును. మౌనంగా నుండి పరబ్రహ్మ యందు మనస్సును నిలిపి ధ్యానంచేయవలయును. బ్రహ్మసాక్షాత్కారమును పొందవలయును. బ్రహ్మానుభూతిచేత సకలద్వైత భ్రమను నశింపచేసుకొనవలయును. ఆత్మజ్ఞానంవలన సంచిత కర్మరాశిని దహింపచేయుము. ఆగామిని అంటకుండా

వుండుము. ఒక ప్రారబ్ధము మాత్రమే వుండునుగనుక అనుభవించుము, ఆ ప్రారబ్ధం పోయినను తరువాత పరబ్రహ్మరూపముగా నుండుము. అని శ్రీ శంకర భగవత్పాదులవారు యేస్థితినుండి యేయే స్థితికి వెళ్ళవలయునో యెట్లు ప్రయత్నించవలయునో, యేదిచేస్తే యేస్థితి కలుగునో విశదముగా నుపదేశించిరి. చెప్పిరి దానినే మరల చెప్పినట్లున్నను పరిపాకదశ కలిగే కొలది ఇంకా ధ్యానం భాగుగా చేసితరించమని యర్థమును సమర్థించుచు గ్రహించవలయును. ఇది స్తోత్రంలో చెప్పిన సోపానసాధనలను వరుసగా చివర ప్రాసితిని.

ప్రతి మానవుడుకూడా ఆనందమును కోరవలసినదే దుఃఖమును పోగొట్టుకొనవలసినదే, ఆనందమునకు సాధనమేమి? దుఃఖము పోవుటకు సాధనమేమని బాగుగా విచారించవలసిన విషయమే. ఆరోగ్య విషయంలో అందరు లోకంలో విచారిస్తున్న విషయమే. కొన్ని జబ్బులు సంభవించినపుడు ఈ జబ్బు యే మందువలన పోవును. యే మంచివలన పుష్టి కలుగునని విచారింతురు. కొన్ని కష్టములను మానసికముగా గాని, శారీరకముగాగాని సంభవించినపుడు ఈ కష్టములు పోవు సాధనము లేవి యని ఆందోళనపడి విచారింతురు. చాలా శ్రమపడి ఆ యా సాధనములను సంపాదించి, అనగా లౌకికసాధనములనుగాని, అనగా ఔషధసేవ చేయుట వినోదకరమైన దృశ్యములను చూచుట, వినుట మున్నగు సాధనములవలన మానసిక శారీరక కష్టములను పోగొట్టుకొనుచున్నారు.కొంత సంపత్తును సంపాదించినను తృప్తిలేక ఇంకను అధిక సంపత్తుకొరకుచాలా శ్రమపడుచున్నారు.

అట్టి అధికసంపద లభించినపుడు చాలా బాధపడుచున్నారు. ఇతరులు చాలా సంపన్నులై యున్నపుడు చూచి సహించలేక అసూయపడుచున్నారు. దాని మూలాన అకారణముగా సజ్జనులయందుకూడా ద్వేష

మును పొందుదుకూడా. ఈ ద్వేష మెందుకు కలిగినది. దీనివలన ప్రయోజనమేమి. కొన్నిపనులు చేసినపుడు ఈ పనులకు ప్రయోజనమేమి, దీనివలన మనకు శాశ్వతమగు ప్రయోజన మేమి కలుగును అని విచారింపవలయును. ఈ సోపాన పంచకములో చెప్పిన ప్రకారం తనకు చేతనయినంతవరకు స్వకర్మలను ఆచరించుచు, భగవంతునియందు భక్తికలిగియున్నయడల సర్వదోషములు, దుర్గుణములు పోవును. "భక్తి ర్దృఢా ధీయతాం" అని చెప్పిరి గనుక భక్తిమార్గమును కూడా వదలకూడదు. సగుణ భక్తి, నిర్గుణ బ్రహ్మసాక్షాత్కారమునకు సాధనమగును.

వాక్యార్థశ్చ విచార్యతాం అని చెప్పిరి. మహావాక్యములయొక్క అర్థమును విచారించవలయును. స్వయముగా అర్థమును తెలుసుకొనలేక పోతే పెద్దలవలన వినవలయునుగాని అసంప్రదాయంగా విచారించకూడదు. ఉపనిషత్తుల పక్షమునే ఆశ్రయించమని చెప్పిరి. ఉపనిషత్తులకు సమ్మతమైన అద్వైతాత్మ విచారమే చేయవలయును. దానికి సూచకముగా బ్రహ్మాస్మీతి విభావ్యతాం అని చెప్పిరి. అనగా జీవబ్రహ్మైక్యమును బోధించుచు మహావాక్యార్థమునే ఈ వాక్యంలో సూచించిరి.

ఈసోపానపంచకములో వేదశాస్త్రాభ్యాసముతో నారంభించినిష్కామకర్మానుష్ఠానం మొదలగు సాధనములను వరుసగాచెప్పి "పరతరే చేతస్సమాధీయతా" అని పరమాత్మయందు మనస్సును నిలుపుమని చెప్పిరి. యల్లపుడు మనస్సు ప్రపంచ విషయములమీదికి వెళ్ళే అభ్యాసములో నున్నదిగనుక ముందు పరమాత్మ స్వరూపమును తెలుసుకొని ప్రపంచ విషయములనుండి మనస్సును మరలుచుటయే ముందు చేయవలసిన అభ్యాసం. అటుల మరలించినపుడు నిద్రలోకి పోవును యెందుచేతనంటే మనస్సుకు ప్రవృత్తి ప్రపంచమందే కలుగును. నివృత్తి కలిగిన సుషుప్తి

స్థితియే కలుగును.గనుక పరమాత్మయందు ప్రవృత్తి కలుగుట చాలాకష్టం. అందుచేత పరమాత్మయందు మనస్సును నిలుపుట సామాన్యమైన పనికాదు.

కొందరు ప్రశాంతగాకూర్చొని ఇదియే పరమాత్మభావనయనిభ్రాంతి పడుదురుకాని అదికాదు. ముందు శ్రవణ మననములు బాగాచేయపలయును, శ్రవణ మననములవలన పరిపాకస్థితి కలిగిన తదుపాత గాని, మనస్సు పరమాత్మయందు నిలబడదు. గనుక అంత సులభమని భ్రమపడి సగుణ సేవను, సగుణధ్యానమును వదలిపెట్టకూడదు. అందువలననే శంకరభగవత్పాదులవారు అతి చంచలమైన మనస్సు నిగ్రహము చాలా కష్టమని ఆ నిగ్రహమునకు సగణసేవ సాధనమని సూచిస్తూ కొన్ని శ్లోకములను ప్రాసిరి. ఆ శ్లోకములను పరతరే చేత స్సమాధీయతా మనే ప్రసంగం ప్రాయుచున్నాను.

శ్లో॥ చేతో భృంగభ్రమసివృధాభవ మరుభూమౌ విరసాయాం
భజభజ లక్ష్మీసరసింహాసఖ పదసరసిజ మకరందం॥

అనగా, ఓమనస్సనే తుమ్మిదా! నీవు సహజముగా ధర్మముల యందుగల మకరందమును, ఆస్వాదించతగిన యోగ్యతకలదానవు. మకరందమనగా పుష్పంసం. అంతేగాని, సారములేని ప్రదేశములయందు తిరుగుట, భ్రమించుటకూడదు. ప్రయోజనంలేదు. నీవు నా సంసారమనే మెట్ట ప్రదేశమందు వృధాగా తిరుగుచున్నావు ఈ సంసార మరుభూమి యందు అనగా ఊసరక్షేత్రమందు వృధాగా తిరగవద్దు. సారంలేదు. సారంలేదుగనుక అనుభవించేదేమియు లేదు. పైగా తిరిగినందువలన శ్రమయేగాని సుఖంలేదు. సుఖమున్నదని భ్రమపడవద్దు. సరే. సంసార మరుభూమియందు సారంలేదు. వృదాగా తిరగవద్దన్నారు బాగానే ఉంది. గాని సారంగల ప్రదేశమిది యని అడిగెదవేమో చెప్పుచున్నాను వినుము.

భజ భజ లక్ష్మీనరసింహా నఖపద సరసిజ మకరందం నిర్గుణమగు అద్వితీయమగు, నిత్యస్వప్రకాశమగు ఆనందరసమును అనుభవించుటయే ముఖ్యముగాని ఒక ఆకారంకల వస్తువులయందే సంచరించు అలవాటులో నున్నావు గనుక నిర్వికారమును అందుకొనలేవు. నిర్వికారమందు నిలబడలేవు. గనుక లక్ష్మీనరసింహస్వామివారి పాదములనే పద్మముల యందు అంతట నిండియున్న మకరందమును సేవించుము. ఆ మకరందమును సేవించినయడల చాలా ఆనందము కలుగును. భజభజ యనిరెండు మాట్లు యెందుకు చెప్పుచున్నానంటే ఆదరంగా యల్లపుడు లక్ష్మీనరసింహస్వామివారి పాదారవింద మకరందసేవచేయును. అశ్రద్ధతోమాని, భ్రమతో సంసారమనే మెట్టభూమియందు వృధాగా తిరగబోకని చెప్పుచున్నాను. లక్ష్మీనరసింహస్వామివారి పాదారవింద మకరందమునే సేవించుము. ఆ మకరందమును సేవించినయడల సంసారమనే ఉషరభూమియందు తిరిగే దుస్థితి నీకు పోవును.

లక్ష్మీనరసింహస్వామివారి పాదారవింద మకరందమును యల్లపుడు సేవింపుము. ఇదియే పరమానందముగానుండి స్వయాపానుభూతిని కలుగజేసి; గొప్ప ఔషధం- పురాణవ్యాధిని పోగొట్టి ఆరోగ్య సౌఖ్యము నిచ్చినట్లు. అనాదిగా అజ్ఞానమువలన యేర్పడిన జీవత్వభ్రమ, జనన మరణ దుఃఖపరంపరగా నున్న సంసారరోగమును మూలముతోసహా పోగొట్టి నిత్యమగు పరమానందమును చేకూర్చును, అనగా యల్లపుడు సంసారకృత్యములయందే మనస్సును భ్రమింపచేయకూడదు. లక్ష్మీనరసింహస్వామివారి పాదసేవ చేయవలయును. అనగా భగవత్సేవ చేయవలయును. ఆ భగవంతునియందు నిరంతరం భక్తిని పెంచవలయును. సగుణసేవచేతనే నిర్గుణ సాక్షాత్కారముకలిగి అజ్ఞానముతోసహా సంసారభ్రమ నశించి ముక్తిలభించునని తాత్పర్యము.

శ్లో॥ త్వత్పతి జీవప్రియ మిచ్ఛసిచే న్నరహరి పూజాంకురు సతతం।
ప్రతిబింబాలంకృతి విధి కుశలః బింబాలంకృతి మాదధతే॥
చేతోభృంగ భ్రమసివృధాభవ మరుభూమౌ విరసాయాం
భజభజ లక్ష్మీనరసింహా నఖపద సరసిజ మకరందం॥

స్వామీ! నేను మనస్సును, జరముకు, సుఖము ననుభవించేవాడు జీవుడుకదా అయనతో భగవంతుని సేవ చేయమనక, నాతో చెప్పేద రేమిటంటవేమో; నిజమే. జీవుడే సుఖమును అనుభవించేవాడుగాని నీ మీదనే జీవుడు ఆధారపడి యున్నాడు. నీకు జీవునికిని అనాదినుండి సంబంధమున్నది ఆయనకు సుఖదుఃఖములు నీవలననే యేర్పడుచున్నవి. నీవు మంచికృషి చేయకపోతే, జీవుడు బాగుపడడు. నీకు జీవుడు ప్రభువు లాంటివాడు. ప్రభువుకు ఉపకారం చేయవలయునుగాని, అపకారం చేయ కూడదు. నీవు సరిగా లేపు గనుకనే జీవుడు స్వతంత్రముగా బాగుపడ లేక సంసారబాధల ననుభవించుచున్నాడు. గనుక నీకు ప్రభువైన జీవుడు బాగుపడవలెనంటే, యెల్లపుడు భగవంతునిపూజచేయుము, అటుల నీవు నేను చెప్పినప్రకారం భగవంతుని పూజచేసినయడల జీవునికికల సర్వ సంసారబాధలు పోవును.

అయితే బాగుపడవలసినవాడు జీవుడా, అనగా దుఃఖముపోయి సుఖమును పొందవలసినవాడు జీవుడకదా పూజింపతగినవాడు భగవం తుడా పూజచేయవలసింది మనస్సునగు నేనా భగవంతుని పూజించి అలంక రించి తృప్తిపరిచి జీవుడు బాగుపడడమేమిటి అంటావేమో ఓ మనస్సా వినుము. "ప్రతిబింబాలంకృతి విధికుశలః బింబాలంకృతి మాదధతే" లోకంలో బింబము, ప్రతిబింబము అంటారు. తెలుసునుకదా, మన ముఖం

బింబం అద్దములో చూసుకుంటే, అద్దములో కనిపించే ప్రతిబింబము కదా, అద్దములో ప్రతిబింబించిన మన ముఖము బాగా అలంకారముగా కనిపించవలెనంటే అసలు ముఖమును బాగా అలంకరించుకొని తిలకము మొదలగునవి పెట్టుకొని అదములో చూస్తే అద్దములో ప్రతిబింబము అసలుముఖము యేవిధముగాఅలంకారముగానున్నదో అదేవిధముగా కనిపించును.

కారణమేమంటే, అసలు ముఖమగుబింబమేకనిపించుటగనుకబింబంకంటే ప్రతిబింబము వేరుకాదు, గనుకనే అందరు బింబమునే అలంకరించుకొందురు. జీవుడు, ఈశ్వరుడు ఇద్దరున్నారు కదా. అందులో జీవుడు ప్రతిబింబము, ఈశ్వరుడు బింబము. గనుక బింబమగు భగవంతుని పూజించినయెడల, సేవించి తృప్తిపరచిన యడల అట్టి తృప్తి, అట్టి అలంకారము, ప్రతిబింబరూపముగానున్న జీవునికి తప్పక వచ్చును. గనుక ఓ మనస్సా నీవు ప్రతిబింబమగు జీవుడు బాగుపడవలెనంటే బింబమగు భగవంతుని ముఖ్యముగా పూజించి సేవించుము. జీవుడు తప్పక ఈశ్వరస్వరూపుడగును. భగవంతుని ఏవిధముగా వుపాసిస్తారో, వుపాసకుడుకూడా ఉపాసింపబడె భగవత్స్వరూపుడగునని శాస్త్రముకూడా చెప్పుచున్నది.

బింబమగు భగవంతునికంటే ప్రతిబింబమగు జీవుడు వేరేలేడని అర్థము, అనగా నిర్గుణధ్యానం చేయలేనపుడు సగుణారాధనచేసి, సగుణమగు ఈశ్వరుని అనుగ్రహము పొంది నిర్గుణ సాక్షాత్కారమును సంపాదించి కృతకృత్యులముకావాలని తాత్పర్యము. జీవేశ్వరులు ప్రతిబింబము రూపులుగనుక పరమాత్మ ప్రతిబింబించుటకు అద్దంలాంటి ఉపాధిమనస్సే గనుక ఆ మనస్సునందుగల పరమాత్మ ప్రతిబింబమే జీవుడు. ఆ మనస్సనే వుపాధిని సగుణసేవద్వారా నిర్గుణబ్రహ్మసాక్షాత్కారమును సంపాదించి లయంచేయగానే జీవునికి ప్రతిబింబమును, ఈశ్వరునికి బింబత్వం

కూడా పోవును గనుక, ఆ ప్రతిబింబమగుజీవుడు బింబమగు పరమాత్మలో ఐక్యమును పొందునని కూడా అభిప్రాయమని చెప్పుకొనవచ్చును.

జీవుడను భేదము కలుగుటకు మనస్సే కారణము అందువలననే "మన ఏవ మనుష్యాణాం కారణం బంధు మోక్షయోః" అనగా జీవులకు బంధమునకుగాని, మోక్షమునకుగాని మనస్సే కారణము, మనస్సు ఆత్మ భిన్నమగు ప్రపంచ విషయములయందు ఆసక్తి కలిగియున్నయెడల జీవుడు బంధమును పొందును. పరమాత్మ విచారముచేసి,పరమాత్మధ్యానం చేసి, పరమాత్మయందే నిలిచినయెడల అనగా తదాకారితమైన యెడల జీవుడు బంధమును పోగొట్టుకుని పరమాత్మ స్వరూపస్థితియనే ముక్తిని పొందును.

శ్లో॥ శుక్తౌ రజత ప్రతిభాజాతా కటకాద్యర్థ సమర్థాచేత్
దుఃఖమయీతే సంసృతిరేషా నిర్వృతిదానే నిపుణాస్యాత్
చేతోభృంగ=మకరందం॥

సంసారదశయందు సంసారమువలన సుఖమెంతమాత్రమూ లేదు. యెటులననగా ముత్యపుచిప్పయందు వెండియని భ్రమకలుగును ఒకప్పుడు ఆ భ్రమలో కనిపించిన వెండి, కడియములు మొదలగు వెండి సామానులు చేయించుకొనుట కుపయోగిస్తే, సంసారము కూడా మోక్షమునిచ్చును. అనగా ఆ పరమానందము నిచ్చుటలో సాధనమగును. అట్లు యెప్పుడు కాదు. శుక్తిరజితము, వెండి సామానులకూ ఉపయోగించదు. సంసారము, ముక్తికిని వుపయోగించదని తాత్పర్యము గనుక ఓ మనస్సా,నీవు సంసార మరుభూమియందు వృధాగా పరిభ్రమింపక భగవంతుని సేవింపుము.

శ్లో॥ ఆకృతి సామ్యాచ్ఛారి కుసుమేస్థల నళినత్వ భ్రమ
మకరోః।
గధంరసావిహ కిమువిద్యేతే విఫలం భ్రామ్యసి
విస్మయైనం॥
చేతోభృంగ=మకరందం

ఓ మనస్సా! నీవు బూరుగపుష్పమును చూచి మెట్టతామర పువ్వని భ్రమపడితివి. రెండిటికిని ఆకారసామ్యమువలనకదా. బూరుగ పుష్పమందు గంధము, రసము ఏమియు లేవు. వృధాగా తిరుగుచున్నావు గంధరసము లులేని బూరుగ పుష్పమును వదలుము, అనగా సంసారమంతయు సారము లేనిదిగనుక. నిజమైన సుఖము లేదుగనుక. ఈ సంసారమందు భ్రమపడి సంచరించుటవలన దుఃఖముకలుగుటయేగాని విశ్రాంతి కలుగదు, భగవంతుని పాదారవింద సేవచేయుటయే నీకు క్షేమమని, భగవదనుగ్రహమే జీవునికి తరుణోపాయమని తాత్పర్యము.

శ్లో॥ స్రక్చందన వనితా న్విషయాన్సుఖదాన్మత్వా౨
స్రవిహరసే।
గంధపలీ సదృశామీతే భోగానంతర దుఃఖకృతః॥
చేతోభృంగ=మకరందం

ఓ మనస్సా, నీవు పుష్పమాలికలు, మంచిగంధము, స్త్రీలు మొదలగు విషయములవలననే చాలా సుఖము కలుగునని చాలా భ్రమతో ఈ విషయములనే అనుభవించుచున్నావు, భావించుచున్నావుగాని, వీనివలన సుఖమేమాత్రములేదు. ఇవి సంపెంగపువ్వుతో సమానమైనవి. సంపెంగ పువ్వుమీదకి గంధమును అనుభవింతమనే భ్రాంతితో తుమ్మెద వెళ్ళినట్లే

మరణమే సంభవించునుకదా. సంపెంగపువ్వు అనుభవం నీకున్నదికదా, దానితో సమానమగు ఈ విషయములుకూడా మరణప్రదములేగాని సుఖ సాధనములుకావని తెలుసుకొనుము. అటుగా విషయములు సుఖసాధనము లనుకొనుట చాలా పొరపాటు. విషయములనగా బంధించేవి యని అర్థము, జీవునికి నిజమైన సుఖము లేకుండా తత్వమును తెలుసుకొనకుండాచేసి మిథ్యా భూతమగు ప్రపంచములో బంధమునిచ్చునవే విషయములు. అట్టి విషయములవలన సుఖము కలుగునని భ్రమపడకూడదు, భగవంతుని సేవ చేసి, ఇట్టి భ్రమను క్రమముగా పదలి కృతకృత్యులు కాచలయునని తాత్పర్యము.

అన్నింటికి సారాంశమగు తత్వమును చెప్పెదను వినుము. ఈ తత్వమును గ్రహించినయెడల నీకు ప్రమాదమెప్పుడు కూడా పుండదు. పరమానందము కలుగును.

శ్లో॥ తవహిత మేకం వచనం వక్ష్యే శృణు సుఖ కామో
యది సతతం
స్వప్నే దృష్టం సకలం హిమృషా జాగ్రతిచ స్మర
తద్వదితి।
చేతోభృంగభ్రమసి వృథాభవ మరుభూమౌ
విరసాయాం।
భజభజ లక్ష్మీనరసింహా నఘపద సరసిజ మీకరందం॥

నీవు బాగుపడవలెనంటే, బాగా సుఖపడవలెనంటే చాలా హితమైన ఒక్కమాట చెప్పెదను వినుము. నేను చెప్పిన తరువాత విని ఇంతేకదా యనే తేలికగా భావించవద్దు అది ఏమనగా "స్వప్నేదృష్టం సకలంమృషా జాగ్రతిచ స్మర తద్వదితి" అనగా స్వప్నావస్థయందు రాజ్యము

లభించినట్లు, తన రాజు అయి రాజ్యపరిపాలన చేసినట్లు కనిపించినను. ఆ సమయమంను ఆ రాజభోగములవలన సుఖము భాసించినను, పుత్ర మిత్ర కళత్రాదులు కనిపించి వాటివలన చాలా సుఖమును అనుభవించునట్లు గోచరించినను, యింకాతను అనేక విషయభోగములను అనుభవించినట్లు స్వప్న దశయందు గోచరించి సుఖము కలిగినట్లున్నను ఆ సమయమందు అది సత్యముగా గోచరించినను మెళకువవచ్చేసరికి అంతయు మాయమైపోవు చున్నదనే విషయం అనుభవసిద్ధమే.

స్వప్నావస్థయందు కనిపించిన దృశ్యములు సత్యమను వారెవ్వరును లేరుకదా. అందువలననే అందరికిని స్వప్నమందలి దృశ్యములు సత్యములు కావని సమ్మతం గనుకనే దృష్టాంతముగా స్వప్నావస్థను చెప్పిరి. స్వప్నమువలె జాగ్రదవస్థయందు కనిపించే ప్రపంచమంతయు మృషా. అనగా మిథ్యా. అనగా పరమాత్మానుభూతియనే ప్రబోధ కలిగిన తరువాత నశించునదే యని అర్థము, స్వప్నప్రపంచమువలె జాగ్రత్ప్రపంచముకూడా ఆరోపమేనని, మిథ్యాభూతమేనని సర్వదా స్మరించుము మెళకువలాగానే స్వప్నావస్థయందు కల్పితమగు ప్రపంచముతో సహా ఆ యవస్థయందు కల్పితమగు ఉపాధిగల స్వప్నద్రష్టకూడా స్వప్న శరీరమును వదలి జాగ్రదవస్థలోనున్న స్వరూపంతో మిగులుతున్నాడు.

అటులనే ఆత్మసాక్షాత్కారమనే మెళకువ రాగానే అజ్ఞాననిద్రలో కల్పితమగు ఈ ప్రపంచభ్రమ పోయి. ఈ ప్రపంచమును చూచిన కల్పితమగు జీవభావముపోయి వరమాత్మస్వరూపముగా మిగులును. ఈ విషయమును అతివిస్తారముగా దక్షిణామూర్తిస్తోత్ర తాత్పర్య వివరణమందు ప్రకాశితిని. అంతయు మనస్సుచేతనే కల్పితమగుచున్నది గనుక, ఆ మనస్సు జీవునికి ఉపాధియేగనుక మనస్సు ఉండేనే జీవత్వ ముండును

లేకపోతే లేమగనుకను, ఆ మనస్సే జీవుని బంధమోక్షములకు కారణం గనుకను, అట్టి మనస్సును నిగ్రహించుట చాలా కష్టంగనుకను, పిపీలి కాది బ్రహ్మపర్యంతం సమస్తజీవరాసులను సంసార మరుభూమియందు పరిభ్రమింపచేయునది మనస్సే గనుకను పరమ దయామయులగు శంకర భగవత్పాదులవారు ఓ మనస్సా యని మనస్సునే సంబోధించి నీవే జీవుని బాగుచేయవలయును. అందుకొరకు భగవదారాధన చేయవలయును. సంసార మరుభూమియందు సారము లేదు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి పాదారవింద మకరందమును సేవింపుమని చెప్పిరి.

ఈ సోపానపంచకమందు భగవత్పాదులవారు "పరతరే చేతస్యమా ధీయతాం" అని పరమాత్మయందే మనస్సును నిలుపుమని చెప్పిరి. గనుక ప్రసంగవశమున ఈ సోపానపంచక తాత్పర్య వివరణలో ఈ శ్లోకము లను ఉదహరించి తాత్పర్యమును వ్రాసితిని. ఈ సోసానపంచకములోని చివరశ్లోకములో చివరన "అథ పరబ్రహ్మాత్మ నాస్థీయతా" మని చెప్పిరి. బహుజన్మలలో చేసినమహాపుణ్యములతో పరిశుద్ధమైన అంతఃకరణకలిగిన మహానుభావులు పరమ నిరక్తులై, తత్వవిచారముచేసి, బ్రహ్మాత్మసంచేసి, బ్రహ్మానుభూతినిపొంది పరబ్రహ్మ రూపముగా నుందురు. గనుక జిజ్ఞాసు లందరును వేదశాస్త్ర సర్వసారమును బోధించు ఈ సోపానపంచకమందు చెప్పిన సాధనలను శాస్త్రోక్తప్రకారముగాను. అధికారానుసారముగాను ఆచరించి పరమాత్మాను భూతిని పొంది పరబ్రహ్మరూపులుగా నుండవల యునని తాత్పర్యము.

ఇట్లు శ్రీ శంకరాచార్య విరచితమగు శ్రీ మదద్వైతోపదేశ సంచ
రత్నములనే మరియొక పేరుగల సోపాన పంచకమునకు
మద్దులపల్లి మాణిక్యశాస్త్రిచే రచింపబడిన తత్వరహస్యప్రభ యను
తెలుగు టీకా తాత్పర్యవివరణం సమాప్తం.

సోపాన పంచకం సమాప్తం.